ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 11-09- 2026 | సంపుటి: 17, సంచిక: 160, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో

Part 2

# దళారుల దందా ఆగదా..?




ప్రజా కలం ప్రత్యేకం..

ఒక్కో దళారి వందలాది ఫైల్స్ తో వచ్చి ఆఫీస్ లో పెత్తనం




- బ్రోకర్లను నమ్మి మోసపోతున్న జనం...
- ఎంత ఆన్లైన్ వ్యవస్థ వచ్చినా అదే మోసం...
- జేబులు గుల్ల చేసుకుంటున్న సామాన్య జనం
- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- జవాబుదారీతనం లేని అధికార యంత్రాంగం
- ప్రభుత్వ కార్యాలయాల్లో బ్రోకర్లకు పనేంటి..?
- దళారుల వ్యవహారంతో ప్రభుత్వ సంస్థలపైన ప్రజలకు సన్నగిల్లుతున్న నమ్మకం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వ కార్యాలయాలలో దళారులు,బ్రోకర్లు,మధ్యవర్తుల చేతులలో మోసానికి గురవుతున్న ప్రజలకు ఇలాంటి సంఘటనలు ఎదురుకాకుండా మెరుగైన సేవలు అందించడానికి పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వాలు పారదర్శకంగా ఆన్లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టినా ఇలాంటి వారి మోసాలు అనేక రకాలుగా రూపాంతరం చెందుతున్నాయి. అడుగడుగునా ప్రజలు మోసానికి గురవుతూనే ఉన్నారు.

తరువాయి 2వ పేజీలో...



వెయ్యి రోజుల పాలనను

# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రతిపక్ష కుట్రలను తిప్పికొట్టాలి..
-ఎమ్మెల్యేలు సభలో చురుగ్గా పాల్గొనాలి
- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు శాసనసభను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభా కార్యక్రమాలను అడ్డుకునేందుకు కుట్ర చేసిందని సీఎం ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశమై సభను సజావుగా సాగకుండా చేసేందుకు వ్యూహం రూపొందించారని విమర్శించారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మహిళా అధికారులను ఇబ్బందులకు గురిచేయడం, సభాపతిని అభ్యంతరకరంగా దూషించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

## రూ.5 లక్షల ఉచిత సాయం.. తెలంగాణలోనే అమలు

## రెండో విడతలో 59 వేల గుడిసెలకు ప్రాధాన్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఇందిరమ్మ ఇళ్లపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అర్హులైన పేదలకు అక్కడే ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, డ్రాలో ఎంపికైన వారిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని తెలిపారు. ఇతర నియోజక వర్గాలకు చెందిన వారు ఎంపికైనట్లు తేలితే పేర్లు తొలగిస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఉచిత సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు. తొలి, రెండో విడతల్లో సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేయనుందని తెలిపారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు అందిస్తామన్నారు.

**గుడిసెలకు ప్రాధాన్యం**

రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా ప్రత్యేక అవకాశం కల్పించామని, ప్రతి 2 వేల ఇళ్లలో 500 ఇళ్లను ఈ కేటగిరీకి కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను మార్కెట్ ధర కంటే తక్కువకు అందించేలా కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, రూ.310--320 ధర ఉన్న 50 కిలోల బస్తాను రూ.230కే అందించనున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులైన అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష అడ్వాన్స్ అందించే అవకాశం కల్పించామన్నారు.



# ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

## రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: సీఎస్ సంజయ్ జాజు

## రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

2026-27 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సచివాలయంలో గురువారం ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సీజన్‌లో 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా.. సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

**8,283 కేంద్రాలు**

రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఇతర ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్టోబరులో ధాన్యం రాక ప్రారంభమై.. నవంబరులో భారీగా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ధాన్యం రవాణా, హమాలీలు, గోదాములు, నిల్వ సామర్థ్యం, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల్లో జాప్యం లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సీఎస్ స్పష్టం చేశారు.

# ఇటలీ భాషలో ఫీజుల బాధ!

## రాష్ట్రంలో 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

## ఇటాలియన్‌లో లేఖరాసిన బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ లో ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బుల కోసం విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ప్రతిపక్షాలు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూనే ఉన్నాయి. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలంటూ మొన్నటికి మొన్న బీజేపీ అసెంబ్లీ ముట్టడి చేపట్టింది. తాజాగా, విద్యార్థుల ఆవేదనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు వినూత్న పద్ధతిలో కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియజేసే ప్రయత్నం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కి ఇటలీ భాషలో లేఖ రాశారు. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు వినూత్న నిరసన చేపట్టారు.

తరువాయి 2వ పేజీలో...

# ఈనెల 17 న పబ్లిక్ గార్డెన్ లో ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపంవద్ద, పబ్లిక్ గార్డెన్ లో




సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కు గానూ ఈనెల 15 న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహిళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

# ఉద్యోగులకు రూ.కోటి బీమా



- దేశంలోనే తొలిసారి తెలంగాణలో..
- పైసా ప్రీమియం లేకుండానే ఆర్థిక భరోసా
- బ్యాంకుల సహకారంతో అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వ ఉద్యోగులు , కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ సిబ్బంది , పెన్షనం కు కోటి రూ పాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా తెలంగా ణ అమలు చేస్తున్న ఈ పథకం.. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణిస్తే అతడి కుటుంబం రోడ్డున పడకుండా ఆర్థిక భరోసాగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



## అంబర్‌పేట్ తాహాషిల్దార్ కార్యాలయంలో

# దళారుల దందా ఆగదా..?




మొదటి పేజీ తరువాయి...

జేబులు గుల్ల చేసుకుంటున్నారు. జరుగుతున్న మోసాలలో ప్రభుత్వ కార్యాలయలలో సిబ్బంది ప్రముఖ పాత్ర వహిస్తుందని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో జరుగుతున్న ఈ వ్యవహారం పైన ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే ప్రభుత్వాలపైన,ప్రభుత్వ అధికారుల పైన ప్రజలకు చెడు అభిప్రాయం ఏర్పడుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

**అంబర్పేట్ తాహాషిల్దార్ కార్యాలయంలో దళారుల ఇష్టారాజ్యం**

అంబర్పేట్ తాహాషిల్దార్ కార్యాలయంలో దళారుల చేతుల్లో ఇలాంటి సంఘటనలు అనునిత్యం జరుగుతూనే ఉన్నాయని ప్రజలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.ధ్రువపత్రాల పత్రాల కోసం ఈసేవా,మీసేవా కేంద్రాలలో ధరఖాస్తు చేసుకున్నాక అక్కడే రాయబారాలు కుదుర్చుకొని వ్యవహారం నడిపిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఏ సర్టిఫికెట్ కావాలన్నా రెండు నుంచి మూడు వేల రూపాయలు ఖర్చు అవుతుందని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందిన కాడికి దండుకుంటూ సామాన్యులను పట్టిపీడిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

**అంబర్పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో దళారుల ఇష్టారాజ్యం**

అంబర్పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం నడుస్తుంది.ఒక్కోవ్యక్తి వందలాది అప్లికేషన్ ఫారాలు తెచ్చి దర్జాగా అధికారుల సీట్లలో కూర్చుని వారి ఫైల్స్ వారే చెక్ చేస్తున్నారంటే వారికి వీరికి ఎలాంటి సత్సంబంధాలు ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది.దళారులు చేసే హడావిడి ఫైల్స్ చూడడాన్ని కార్యాలయ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

**ధ్రువపత్రాల జారీ ప్రక్రియ విదానం..**

సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ మీసేవ కేంద్రంలో గాని,ప్రైవేట్ మీసేవ కేంద్రంలో కానీ సరిఅగు పత్రాలు చూపి అప్లై చేసుకున్నాక ఆ పత్రాలను మీసేవ కేంద్రం వారు నేరుగా ఎమ్మార్వో కార్యాలయంలో సమర్పించాలి, తదుపరి ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది ఆ వ్యక్తి యొక్క చిరునామా వివరాల ఆధారంగా పత్రాలను పరిశీలించి విచారణ జరిపి తను సమర్పించిన ఆధారాలు సరైనవి అనిపిస్తే అప్పుడు ధ్రువపత్రాలు జారీ చేయాలి.ధ్రువపత్రాల కోసం తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా తను ఇచ్చిన పత్రాలలో ఏదైనా సమాచార లోపం ఉన్నా అప్పుడు తిరస్కరించాలి.

**బ్రోకర్లకు ఎమ్మార్వో కార్యాలయంలో పేనేంటి?**

దళారులకు అడ్డాగా మారిన అంబర్‌పేట్ తాహాషిల్దార్ కార్యాలయంలో అధికారులతో కలిసి అమాయక ప్రజలను పీడించుకు తింటున్నారని ప్రజల్లో తీవ్రస్థాయిలో అనేక విమర్శలు ఉన్నాయి.దళారులు లేకుండా ఏ చిన్న ఫైలు కూడా ముందుకు కదలడం లేదని,ధ్రువపత్రాల జారీకి కూడా ఒక నిర్దిష్ట ధరను నిర్ణయించి వసూలు చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఎమ్మార్వోకు తెలియకుండానే జరుగుతుందా..?

**ఎన్ని విమర్శలు ఎదురవుతున్న ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**

**అవినీతి అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్**

ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యంగా ఎమ్మార్వో కార్యాలయాలలో జరిగే అవినీతి అక్రమాలపై ప్రభుత్వాలు,అవినీతి నిరోధక శాఖ ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా,పారదర్శకంగా ఆన్లైన్ వ్యవస్థను ఏర్పాటుచేసినా క్షేత్రస్థాయిలో అవినీతి రూపాలు వివిధ రకాలుగా మారుతున్నాయే తప్ప తగ్గడం లేదు.ఈ వ్యవస్థలో మార్పులు రావాలంటే కార్యాలయ సిబ్బందిలో అధికారుల్లో మార్పు వచ్చే విధంగా ప్రభుత్వం ఇంకా కఠినమైన నిబంధనలు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



## వెయ్యి రోజుల పాలనను

# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్ నిరసనలకు ప్రతిగా దళితులను అవమానించేలా వ్యవహరించారని ఆరోపించారు. జరిగిన ఘటనలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ప్రతిపక్ష కుట్రలను సమర్థంగా తిప్పికొట్టి ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యేలను అభినందించారు.

**సభకు సంపూర్ణ హాజరు**

ఎమ్మెల్యేలు అసెంబ్లీ చర్చల్లో తప్పనిసరిగా పాల్గొనాలని, సభ జరిగినన్ని రోజులు హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సీఎం సూచించారు. ప్రజలు ఇచ్చిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించడం కష్టమవుతుందని హెచ్చరించారు. నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**'కాంగ్రెస్ అవకాశంతోనే ఎదిగారు'**

కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి.. అదే పార్టీకి నష్టం కలిగించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు.

**'ఓటు హక్కును కాపాడాలి'**

దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఓటు హక్కును పరిరక్షించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ప్రతి ఎమ్మెల్యే వ్యక్తిగత పనితీరు, ప్రజల్లో ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కులగణనలో తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. జనగణనలో తెలంగాణ సాధించిన విజయాన్ని దేశానికి రోల్‌మోడల్‌గా నిలిపామని చెప్పారు.

**'వెయ్యి రోజుల పాలనకు సహకారం అభినందనీయం'**

వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ఎమ్మెల్యేల సహకారం ఎంతో కీలకమని సీఎం పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు రూ.కోటి బీమా

మొదటి పేజీ తరువాయి...

నగర పర్యటనలను అన్వేషించండి

గురువారం శాసనసభ ప్ర శ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తుందన్నారు. రాష్ట్రం లో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నారని తెలిపారు. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్, 5,00,158 మంది తాత్కాలిక, ఔట్ సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్‌ఆర్ఈ జీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది, 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని వెల్లడించారు.

బీమా పథకా నికి తొలుత సింగరేణి కాలరీస్, ఆ తరువాత విద్యుత్ శాఖ, అనంతరం రాష్ట్రంలోని ప్రభు త్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. ఉ ద్యోగుల వేతనాలు జ మ కావడంతో వ్యాపారపరంగా లబ్ధి పొం దుతున్న బ్యాంకులు.. బీమా పథకానికి సహకరించేందుకు ముందుకు వచ్చి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై, ఉ ద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం పడకుం డా పథకం అమలు జరుగుతుందన్నారు.

ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించిన ట్లు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు. విద్యు త్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీ జెన్కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించామని. రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు చేసిన ట్లు వెల్లడించారు. సింగరేణిలో 50 క్లెయిమ్‌లకు గాను అన్నింటినీ పరిష్కరించినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉ ద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పా టు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సేవలు పొందండి

ప్రభుత్వ సేవలు పొందండి

విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. స హజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్ర యోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్ర భుత్వం కూడా అధ్యయనం చేసిందని, ఇతర రాష్ట్రాలు సైతం ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇప్పటికే ఈ తరహా స్కీంతోపాటు ప్రభు త్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని తమిళనాడు సర్కార్ అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రు ల్లో నగదురహిత సేవలందిస్తూ ప్రభుత్వ ఉ ద్యోగుల కలను ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. హెల్త్‌కార్డు స్కీంకోసం ఇప్పటికే రూ. 240 కోట్ల కేటాయించినట్లు భట్టి వెల్లడించారు. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా హెల్త్‌కార్డు, బీమా పథకాలను రూపొందించినట్లు తెలిపారు.

# ఇటలీ భాషలో ఫీజుల బాధ!

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్‌గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన 'మాతృభాష' అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు ఆయన ఎద్దేవా చేశారు. రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆందోళన చెందారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయన్నారు. అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా బీజేపీ నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత పది రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసాకార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని అన్నారు. రాహుల్‌గాంధీ తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తేవాలని, విద్యావ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాప్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



సంప్రదించాల్సిన నంబరు:
+91 95535 39999

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

## నిర్మల్ స్పెషల్ సబ్‌జైల్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ సెప్టెంబర్ 10(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ స్పెషల్ సబ్‌జైల్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. స్పెషల్ సబ్‌జైలుకు చేరుకున్న



జిల్లా ఎస్పీకి సబ్‌జైలు సూపరింటెండెంట్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జైలు ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల పనితీరు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎస్పీ పరిశీలించారు. జైలు భద్రతా ఏర్పాట్లు నిబంధనల ప్రకారం ఉన్నాయా, భద్రతా సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, జైలు పరిసరాల్లో పర్యవేక్షణ ఎలా ఉంది అనే అంశాలను ఎస్పీ పరిశీలించారు. అలాగే ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.జైలు భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. స్పెషల్ సబ్‌జైల్‌లో భద్రత, నిర్వహణలో సిబ్బంది చేస్తున్న కృషిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఏఆర్ ఆర్ఐ రామ్‌నిరంజన్, జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి, హెడ్ వార్డెన్, జైలు గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తానూర్ మండలంలో ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు



తానూర్, సెప్టెంబర్ 10(ప్రజా కలం): మండల వ్యాప్తంగా పొలాల అమావాస్య వేడుకలను గురువారం రైతులు, ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు, మండల కేంద్రమైన తానూర్‌తో పాటు కోలూర్, మొగిలి, వడ్గావ్, జవులా (కే), తోండాల, జవులా (బి), నందిగాం, సింగన్గావ్, ఎల్వి, భోసి,బోల్సా, బెంబర్ తదితర గ్రామాల్లో ఈ పండుగ వాతావరణం సంతరించుకుంది, వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే బసవన్నలను (ఎడ్లను) రైతులు రంగులు, అలంకరణ వస్తువులతో అందంగా ముస్తాబు చేశారు,ఆయా గ్రామాల్లోని శ్రీ మహాలక్ష్మి, పోచమ్మ, హనుమాన్ ఆలయాల వద్దకు ఎడ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రదక్షిణలు చేయించారు,అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఆలయ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అండర్-17 వాలీబాల్ జిల్లా స్థాయికి ఎంపికైన గ్రేస్ మిషన్ స్కూల్ విద్యార్థులు

ప్రజాకలం ప్రతినిధి మణుగూరు,సెప్టెంబర్10: క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ



ముందుకు సాగుతున్న మణుగూరులోని గ్రేస్ మిషన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-17 వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యంతో జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చదువుతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం మరియు మానసిక వికాసం కలిగి జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతుందని తెలిపారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ పాఠశాలలో ప్రత్యేకంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి పుల్లారావు, ప్రిన్సిపాల్ మల్లేశ్వర్ రావు, సెక్రటరీ శామ్యూల్, పీఈటీ వెంకటేశ్వర్లు, వార్డెన్ వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో మరింత ఉత్సాహంతో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మణుగూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీఈటీ, ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పీఈటీకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే జిల్లా స్థాయి పోటీల్లో కూడా సమష్టి కృషితో విజయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## నిరుపేదలకు సేవ చేసేందు కే ఇశ్రాయేలు ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

తల్లాడ సెప్టెంబర్ 10 ప్రజా కలం న్యూస్ : సమాజంలో నిరుపేదలకు సేవ చేసేందుకే ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ఇశ్రాయేలు చారిటబుల్




ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రదర్ ఖమ్మంపాటి ఇజ్రాయిల్ తెలిపారు. గురువారం వైరా నారపునేనిపల్లికి చెందిన నిరుపేద వృద్ధురాలు దుగ్గిరాల రాములయ్యకు ఆ సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్ ని దోమతెరలు దుప్పట్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కన్నా సాయం చేసే చేతులు మిన్న తోటి వారిని మానవత్వంతో ఆదుకునేది ప్రేమ తమ సేవా సంస్థ ద్వారా నిరుపేదలను గుర్తించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాలకు దాతల సహకారంతో ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టి పేద వర్గాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆధూరి యోనా లక్ష్మయ్య రంగమ్మ స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మరిపెడ లో రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా

- నకిలీ సర్టిఫికెట్లతో పుట్టుకొస్తున్న మెడికల్ అండ్ క్లినిక్స్
- అర్హత లేని వైద్యం అందిస్తున్నా అధికారుల చర్యలు శూన్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటమా అంటూ తీవ్రంగా మండిపడుతున్న ప్రజలు







మరిపెడ ప్రతినిధి ప్రజాకలం న్యూస్ సెప్టెంబర్ 10

ప్రాణాలు కాపాడే డాక్టర్లని దేవుళ్ళతో పోలుస్తారు కానీ వారు మాత్రం ప్రజల ప్రాణాలని వ్యాపారంలా చూస్తున్నారు లాభాల కోసం నకిలీ సర్టిఫికెట్లతో మరిపెడ మండల కేంద్రంలో జోరుగా తెరుస్తున్న మెడికల్ షాపులు క్లినిక్లు వైద్యం పేరుతో అర్హతలు లేని వ్యక్తులు చికిత్స అందిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.సరైన వైద్య అర్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండానే కొందరు వ్యక్తులు క్లినిక్‌లు నిర్వహిస్తూ రోగులకు మందులు ఇస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. చిన్నపాటి అనారోగ్యంతో వచ్చే ప్రజలకు పరీక్షలు నిర్వహించడం, ఇంజెక్షన్లు ఇవ్వడం, వివిధ రకాల మందులు సూచించడం వంటి వైద్య సేవలు అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కొరతను ఆసరాగా చేసుకుని కొందరు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**ప్రాణానికి గ్యారెంటీ లేదు వ్యాపారం లా మారిన వైద్యం**

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉండాల్సిన వైద్య రంగంలో కొందరు డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేని మందులు, ఇంజెక్షన్లు లేదా చికిత్సలు చేస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అర్హత లేని వ్యక్తుల చేతిలో చికిత్స తీసుకోవడం వల్ల సరైన వ్యాధి నిర్ధారణ ఆలస్యం కావడం, తప్పు మందులు వాడటం, అనవసరమైన చికిత్సలు పొందడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. తీవ్రమైన పరిస్థితుల్లో ప్రాణాపాయం కూడా సంభవించే ప్రమాదం ఉంది. ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, మెడికల్ షాపులు, అనధికార వైద్య కేంద్రాలపై సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య సేవలు అందిస్తున్న ప్రతి వ్యక్తి విద్యార్హతలు, సంబంధిత రిజిస్ట్రేషన్, క్లినిక్‌కు అవసరమైన అనుమతులు, మందుల వినియోగం తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**మీ పబ్బం గడుపుకోవడం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు...** వైద్యం విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. చికిత్స తీసుకునే ముందు వైద్యుడి అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకోవడం, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉంటే అర్హత కలిగిన వైద్య నిపుణులను సంప్రదించడం అవసరం.నకిలీ సర్టిఫికెట్లతో అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదులు అందితే అధికారులు వెంటనే విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో సంబంధం ఉన్న ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అనధికార వైద్య కార్యకలాపాలపై మండల స్థాయి మరియు గ్రామస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## దొరల గడియలను బద్దలు కొట్టిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానంపై పోరాడాలి

### - సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం):

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చిట్యాల ఐలమ్మ అగ్నికణంలా పోరాడి భూస్వాముల దౌర్జన్యాలకు, నిజాం పాలకుల అరాచకాలకు ఎదురు నిలిచారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాగర్‌కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్ అన్నారు. చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సీపీఐ నాగర్‌కర్నూల్ టౌన్ సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ బస్టాండ్ సమీపంలోని ఐలమ్మ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. రజక చేతివృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ కొట్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారేడు శివశంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోని జనగామ తాలూకాలో భూస్వాముల గుండాలు, నిజాం సైన్యం ప్రజలను తీవ్రంగా హింసిస్తూ, రైతులు పండించిన పంటలను దోచుకునే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో చిట్యాల ఐలమ్మ కమ్యూనిస్టుల సహకారంతో వీరోచితంగా పోరాడి, తాను పండించిన పంటను కాపాడుకున్నారని తెలిపారు. చిట్యాల ఐలమ్మ వంటి వీరుల త్యాగాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగానే పేద ప్రజలకు భూమిపై హక్కులు, రక్షణ లభించాయని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ వంటి దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ద్వారా పేదలకు ఆత్మగౌరవం, భూమిపై హక్కు దక్కిందని అన్నారు. దొరల గడీలను బద్దలు కొట్టిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో నేటి పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్యంగా తిరుగుబాటు చేయాలని మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న తెలంగాణ




సాయుధ పోరాట వారోత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాగర్ కర్నూల్ టౌన్ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి ఏ ఐ వై ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం ఆంజనేయులు బి హెచ్ పి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వంకేశ్వరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 10:

జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎం.పి.డి ఓ లు, ఎం.పి.ఓ లు, ఎ.పి.ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టి.సి లు, హౌసింగ్ ఎ.ఈ లతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో వివిధ కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఫార్మ్ పాండ్స్, సోక్ పిట్స్, లేబర్ రిపోర్ట్, ఇందిరమ్మ ఇళ్లు, వి.జి.బి.రామ్. జి, చేయూత పింఛన్లు, వనమహోత్సవం, ఇందిరమ్మ మహిళా సాధికారత కార్యక్రమం (వితంతువులు/విడాకులు పొందిన మహిళలు), రేవంత్ అన్న కా సహారా, మైనారిటీ యువత సాధికారత కోసం ఈ-స్కూటర్ల పంపిణీ తదితర కార్యక్రమాల అమలు, పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు.ప్రతి కార్యక్రమాన్ని నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జెడ్. పి.సి.ఈ.ఓ, డి. పి .ఓ వెంకట్ రెడ్డి, డి . ఆర్.డి.ఓ నరసింహులు, గృహనిర్మాణ శాఖ పి.డి ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం



నిర్మల్ సెప్టెంబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఐలమ్మ పోరాటాలను గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించిందని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని వివరించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను నేటి తరం ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### - జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు




నిర్మల్ సెప్టెంబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు.

కలెక్టరేట్ లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్ని సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మన భూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ తెలుగు రచయితల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం సెప్టెంబర్ 10( ప్రజా కలం న్యూస్)

మనభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ తెలుగు రచయితల మహాసభల పోస్టర్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్, మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణతో పాటు రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమని, సాహిత్య కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించవచ్చని అన్నారు. యువతలో తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించేలా ఇలాంటి సాహిత్య సభలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సాహిత్య చర్చలకు, భావ వ్యక్తీకరణకు మంచి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. మనభూమి ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, కవి, రచయిత అశోక్ ఉబ్బేపల్లి మాట్లాడుతూ, తెలుగు భాషా సాహిత్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో జాతీయ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రచయితలు, కవులు, సాహితీవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సాహిత్యంపై చర్చలు, కవితా కార్యక్రమాలు, రచయితల సన్మానాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. "సమాజాన్ని చైతన్యపరిచే శక్తి సాహిత్యానికి ఉంది. రచయిత తన కలంతో సమాజంలోని సమస్యలను ప్రశ్నించడంతో పాటు, మంచి మార్పుకు మార్గం చూపాలి. తెలుగు భాషా సాహిత్యానికి సేవ చేస్తున్న ప్రతి రచయితకు వేదిక కల్పించడమే మనభూమి ట్రస్ట్ లక్ష్యం" అని అశోక్ ఉబ్బేపల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మనభూమి ట్రస్ట్ గౌరవ సలహాదారు వార నాగేశ్వరరావు, ట్రస్ట్ కోశాధికారి చెరుకుపల్లి యశ్వంత్ పాల్గొన్నారు. ఆగస్టు 15 2026 న కూసుమంచి మండలంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మనభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ రచయతల సభను వికాస వేదిక నుంచి దిగ్విజయంగా జరిగింది, అదేవిధంగా,2027 జాతీయ తెలుగు రచయితల మహాసభలకు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మనభూమి ట్రస్ట్ నిర్వాహకులు కోరారు.సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్స్ 9912372842,6300131268.

ప్రజా కలం

శుక్రవారం, సెప్టెంబర్ 11, 2026

## వైరల్ కావాలనే తపన..
## విలువలు మరిచిపోతున్న యువత?

ఒక్క వీడియో… కొన్ని వేల వీక్షణలు… వందల ప్రశంసలు… మరుసటి రోజుకే గుర్తింపు! సామాజిక మాధ్యమాలు అందిస్తున్న ఈ తక్షణ ప్రాచుర్యం యువతను విపరీతంగా ఆకర్షిస్తోంది. ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు అవి గొప్ప వేదికలే. కానీ గుర్తింపే లక్ష్యంగా మారి, దాని కోసం హద్దులు దాటుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. వైరల్ కావాలనే తపనలో విలువలు, బాధ్యత, విచక్షణ వెనక్కి నెట్టబడుతున్నాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఒకప్పుడు ఏదైనా రంగంలో పేరు సంపాదించాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, ఓర్పు అవసరమయ్యేవి. ఇప్పుడు ఒక్క సంచలన దృశ్యం చాలు అన్న భావన కొందరిలో పెరుగుతోంది. రహదారులపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, ప్రాణాలను పణంగా పెట్టి చిత్రీకరణలు చేయడం, ఇతరులను అవమానించేలా దృశ్యాలు రూపొందించడం, వ్యక్తిగత విషయాలను విచక్షణ లేకుండా బహిర్గతం చేయడం వంటివి కేవలం వినోదం కాదు. ఇవి యువతతోపాటు వారిని అనుసరించే వారికి కూడా తప్పుడు సంకేతాలు పంపుతాయి. ఒక క్షణం లభించే చప్పట్ల కోసం జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టడం విజయం ఎలా అవుతుంది? మరో ఆందోళనకర ధోరణి ఇతరులతో పోల్చుకోవడం. సామాజిక మాధ్యమాల్లో కనిపించే జీవితం ఎక్కువగా మెరుగుపరిచిన, ఎంచుకున్న కొన్ని క్షణాల సమాహారం. దానినే నిజమైన జీవితంగా భావించి తమ స్థితిని తక్కువగా అంచనా వేసుకోవడం యువతలో అసంతృప్తికి దారితీస్తోంది. ఖరీదైన వస్తువులు, ఆర్భాటపు జీవనశైలి, విహారయాత్రలు, ప్రముఖులతో పరిచయాలనే విజయానికి కొలమానాలుగా భావించే పరిస్థితి ఏర్పడుతోంది. కష్టం, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలకు ప్రాధాన్యం తగ్గితే అది వ్యక్తికే కాదు సమాజానికీ నష్టం. అయితే సామాజిక మాధ్యమాలను నిందించడం మాత్రమే పరిష్కారం కాదు. వాటిని యువత ఎలా వినియోగిస్తున్నదన్నదే అసలు విషయం. ఇదే వేదికల ద్వారా ప్రతిభను వెలికితీస్తున్నవారు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నవారు, కొత్త ఆలోచనలను పంచుకుంటున్నవారు, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నవారు ఎంతోమంది ఉన్నారు. సమస్య వేదికలో లేదు.. దాని వినియోగంలో ఉంది. కుటుంబాలు, విద్యాసంస్థలు యువతకు డిజిటల్ అవగాహనతోపాటు విలువల ప్రాధాన్యాన్ని తెలియజేయాలి. తల్లిదండ్రులు నియంత్రణ కంటే సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతలో ప్రశ్నించే తత్వం, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన స్పందనను వ్యక్తిగత విలువకు కొలమానంగా భావించకుండా చూడాలి. మన యువత దేశానికి అతిపెద్ద శక్తి. ఆ శక్తి క్షణికమైన ప్రాచుర్యంలో కరిగిపోకూడదు. వైరల్ కావడం విజయానికి కొలమానం కాదు; విలువైనదాన్ని సృష్టించడమే నిజమైన విజయం. ప్రదర్శన కంటే ప్రతిభ, ప్రాచుర్యం కంటే ప్రయోజనం, అనుకరణ కంటే ఆలోచన, క్షణిక చప్పట్ల కంటే శాశ్వత గౌరవం ముఖ్యమని యువత గ్రహించినప్పుడే వారి శక్తి దేశ ప్రగతికి బలమైన పునాదిగా మారుతుంది.

**- (సీహెచ్. ప్రతాప్)**

## చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించి తాడిచెర్ల వాసులు



మల్హార్, సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిధి..తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్‌రావు మండలం తాడిచర్ల గ్రామంలోని ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు, వార్డు సభ్యులు కామబాబు, తిర్రి అశోక్, పైడాకుల దేవేంద్ర, రాజ్యసమ్మయ్యతో పాటు రజక సంఘం మండల అధ్యక్షుడు పావురాల ఓదెలు, ఉపాధ్యక్షుడు కనుకుల రాకేష్, ప్రధాన కార్యదర్శి పైడాకుల సమ్మయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామ శాఖ అధ్యక్షుడు పైడాక లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు పైడాకుల రాజసమ్మయ్య, పైడాకుల గంగన్న, పైడాకుల రాజేశం, జాలిగం కిట్టు, రాచర్ల చందు, కోడిపుంజుల ఓదెలు, నస్పూరి కనకయ్య, కోడిపుంజుల సాంబయ్య, పైడాకుల సాయికృష్ణ, నిమ్మల కేదారి తదితరులతో పాటు పలువురు రజక సోదరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

### – ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎన్ ప్రేమ లత

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 10:

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12 న (శనివారం) మహబూబ్ నగర్ జిల్లా కోర్టు తో పాటు, జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో జాతీయ



లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, -ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎన్ ప్రేమ లత తెలిపారు. గురు వారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడారు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) ప్రధాన న్యాయమూర్తి మరియు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వాజ్యదారుల ప్రయోజనార్థం మహబూబ్ నగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార కమిటీలు జిల్లాలోని మహబూబ్ నగర్,జడ్చర్ల ,దేవరకద్ర న్యాయస్థానాలలో లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పెండింగ్ కేసులు,వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిరా పాల్గొన్నారు.

# నంబర్ వన్ మంత్రి నియోజకవర్గంలో రైతులకు గోస

### పంటలు ఎండిపోతున్నాయి.. కరెంట్ ఇవ్వండి సారూ అంటూ రైతుల వేడుకోలు
### త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలకు తీవ్ర నష్టం
### అధికారులు స్పందించి విద్యుత్ కష్టాలు తీర్చాలని రైతుల విజ్ఞప్తి



మల్హార్, సెప్టెంబర్ 10, ప్రజాకలం ప్రతినిధి

మల్హార్ మండలంలోని రైతుల కష్టాలు ఇంతా అంతా కావు. చేతికి వచ్చిన పంట నోటికందని పరిస్థితి నెలకొంది. ఒకవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలోనూ విద్యుత్ అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయ బోర్లపై ఆధారపడిన పంటలకు నీరందించలేకపోతున్నామని వాపోతున్నారు. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతుల విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి, పంటలకు అవసరమైన మేరకు నిరంతర విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం కనీసం ఐదు, ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా వేళల్లో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ కష్టాల నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

# గుంతలమయంగా మారిన ఆర్ అండ్ బి రహదారి..!

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- 7.8 కిమీ మేర ఎటపాక టూ కన్నాయిగూడెం రహదారి
- ఇసుక లారీల రాకపోకలతో పూర్తిగా ధ్వంసం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం..!
- ఇకనైనా రహదారి మరమ్మత్తులు చేపడతారా..?
- లేనిపక్షంలో ఇసుక లారీలను నిలుపుదల చేస్తాం
- టిడిపి ఆధ్వర్యంలో మూడు గ్రామ పంచాయతీల ప్రజలు
- స్థానిక ఎస్సై అప్పలరాజుకు వినతిపత్రం అందజేత



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక , సెప్టెంబర్ 10 :

నిత్యం తిరుగుతున్న ఇసుక లారీలతో ఎటపాక నుండి కన్నాయిగూడెం మీదుగా చర్ల వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి ధ్వంసమై అధ్వానంగా మారి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. నిరంతరం ఈ అంతర్రాష్ట్ర రహదారిపై ఏదో ఒకచోట వాహనదారులకు ప్రమాదం సంభవిస్తూనే ఉంది. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండలంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండల పరిధిలో రాజుపేట నుండి కన్నాయిగూడెం వరకు సుమారు 7.8 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారి విస్తరించి ఉంది. ఈ క్రమంలో తెలంగాణలోని చర్ల నుండి ఆంధ్రాలోని ఎటపాక మీదుగా భద్రాచలం పట్టణానికి నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఇసుక లారీలతో ఈ రహదారి పూర్తిగా ధ్వంసమై దుమ్ము ధూళితో , గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి ప్రయాణం నరకప్రాయంగా మారిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎటపాక టూ కన్నాయిగూడెం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరడంతో దారి కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఇదే రహదారిపై ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదానికి గురై కిందపడి గాయపడ్డారు. ఈ రోడ్డుపై బస్సులు నడపడం కష్టంగా ఉందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు. రహదారి ధ్వంసం కావడంతో ప్రయాణిస్తున్న ఆటోలు , కార్లు , ద్విచక్ర వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. అయినా తెలంగాణ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దాంతో ఎటపాక మండలంలోని ఎటపాక , పిచ్చుకలపాడు , కన్నాయిగూడెం గ్రామపంచాయతీల ప్రజానీకం ఘాటుగా స్పందిస్తూ ప్రాణాలు పోతున్న అధికారులకు పట్టదా..? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ , ఆంధ్ర , చత్తీస్ ఘడ్ రాష్ట్రాలను కలుపు తూ నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ఈ ప్రధాన రహదారి ఛిద్రం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వాహనదారుల క్షేమం , భద్రత దృష్ట్యా ఈనెల 16 తేదీలోగా తెలంగాణ అధికారులు స్పందించి తక్షణమే ఆర్ అండ్ బి రహదారికి మరమ్మతులు చేపట్టకపోతే ఆంధ్రాలోని తమ గ్రామాల మీదుగా తెలంగాణకు వెళ్లే ఇసుక లారీలను నిలుపుదల చేస్తామని పేర్కొంటూ ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు , తెలంగాణ అధికారులకు తెలియజేయాలని కోరుతూ మూడు గ్రామ పంచాయతీల ప్రజలు టిడిపి రాష్ట్ర నాయకులు ముువ్వా శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం నాడు ఎటపాక పోలీస్ స్టేషన్ లో ఎస్సై జి.అప్పలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సైని కలిసిన వారిలో మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ , బండారు భద్రరావు , సూరేటి సత్యనారాయణ , తోట రమేష్ , అనుగోజు మురళి , ముువ్వా రాము , లావుడ్య రవి నాయక్ , బోడ సామ్య నాయక్ , దాడి ప్రవీణ్ , దాడి రమేష్ , పసుపులేటి రాంబాబు , తదితరులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత తెలంగాణ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రయాణం సాఫీగా సాగేలా చూడాలని స్థానికులు అంటున్నారు.

# పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం కావాలి

- పోషణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కార్యక్రమాలను విజయవంతం చేయాలి
- 'మన అంగన్వాడీ – మన బాధ్యత' నినాదంతో నెల రోజుల పాటు పోషణ అవగాహన కార్యక్రమాలు
- సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు జాతీయ పోషణ మాసం
- జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, సెప్టెంబర్ 10( ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం మహిళా, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ మాసం ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ 'మన అంగన్వాడీ –మన బాధ్యత' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పోషణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పోషణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జాతీయ పోషణ మాసం సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషణ సేవలు, సమతుల్య ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'మన అంగన్వాడీ –మన బాధ్యత' నినాదం తో ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ప్రజలకు చేరువ చేస్తూ, పోషణ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాల వివరాలను సమగ్రంగా నమోదు చేసి విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, సెర్ప్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, పోషణ అభియాన్ డీసీ కె. బాబు, డీపీఏ శ్రీనివాస్, ఈవో, హబ్ కో ఆర్డినేటర్ సమీర్, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పంటల పరిశీలించిన జిల్లా ఉద్యాన అధికారి




తానూర్,సెప్టెంబర్ 10(ప్రజా కలం ): మండలంలోని ఎల్వత్, కోలూర్ గ్రామాలలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.వి. రమణ పర్యటించారు. రైతులతో కలిసి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, నాణ్యమైన దిగుబడులు సాధించడానికి యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి జావిద్ పాషా, విస్తరణ అధికారి మోహిని మియా, సర్పంచ్ మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొయ్యూరు లో చాకలి ఐలమ్మ వర్ధంతి

### సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ



మల్హార్, సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిధి

మల్హార్‌రావు మండలంలోని కొయ్యూరు గ్రామంలో రజక సంఘం మండల అధ్యక్షుడు పావురాల ఓదెలు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షురాలు, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రాజమ్మ మాట్లాడుతూ.. రజాకార్లను ఎదిరించి భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ వీరోచితంగా పోరాటం చేశారని అన్నారు. పేద ప్రజల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో గొప్పదని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి సర్పంచ్ లింగమూర్తి, కొయ్యూరు ఉప సర్పంచ్ లకావత్ సురేందర్, గ్రామ కార్యదర్శి రాజు, ఇప్పలపల్లి ఉప సర్పంచ్ దేవేందర్, బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య, యాదవ సంఘం నాయకుడు రాజయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నరసింహులగూడెంలో పొలం బడి

### – సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన



పాలేరు సెప్టెంబర్ 10( ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండలం పరిధిలోనే గురువారం నరసింహులగూడెం గ్రామంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం, వైరా శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ ఫణిశ్రీ పాల్గొని వరి, పత్తి పంటల్లో సమగ్ర సస్యరక్షణ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, ఆర్థిక నష్ట పరిమితి దాటినప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో పురుగుమందులు వినియోగించాలని సూచించారు. జీవ నియంత్రణ పద్ధతులు, లింగాకర్షణ బుట్టలు, పసుపు–నీలం జిగురు అట్టల వినియోగంపై వివరించారు. అనంతరం వరి, పత్తి పంటలను సందర్శించి ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. రైతులకు జిగురు అట్టలు, వేపనూనె, అవసరమైన పురుగుమందులను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాముడు, సర్పంచ్ కల్కిని సరిత, ఆత్మ కమిటీ సభ్యుడు పిట్టల రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి జానీ బాబా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ని కలిసిన పి ఆర్ టి యు టి ఎస్ ప్రతినిధి బృందం

ఖమ్మం సెప్టెంబర్ 10( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టి యు టి ఎస్ ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ని



హైదరాబాద్ లో కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీ శ్రీ పింగళి శ్రీపాల్ రెడ్డి నాయకత్వంలో ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందం, రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది . ముఖ్యంగా పి ఆర్ సి అమలు , పెండింగ్ డి ఏ ల మంజూరు , పెండింగ్ బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై సవివరంగా చర్చించింది . ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కోరింది . ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సానుకూలంగా విని , సమస్యల పరిష్కారానికి అనుకూలంగా స్పందించారు . ఈ సమావేశంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పులగం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సుంకరి బిక్షం గౌడ్ , ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ కట్టా శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పి ఆర్ టి యు టి ఎస్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర నాయకత్వం పేర్కొంది.

## జిల్లాలో ఘనంగా పొలాల పండుగ



నిర్మల్ సెప్టెంబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో పొలాల పండుగను గురువారం రైతులు, గ్రామీణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే బసవన్నలను (ఎడ్లను) రైతులు రంగులు, అలంకరణ వస్తువులతో అందంగా ముస్తాబు చేశారు,ఆయా గ్రామాల్లోని హనుమాన్ తదితర ఆలయాల వద్దకు ఎడ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రదక్షిణలు చేయించారు,అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు,రైతులు తమ వ్యవసాయ పరికరాలకు, పంటలకు పూజలు నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. పంటల సాగు, రైతుల శ్రమకు ప్రతీకగా నిలిచే పొలాల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రైతులకు మంచి దిగుబడులు రావాలని, ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఆలయ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రైతులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**– భూమి.. భుక్తి.. వెట్టి విముక్తి కోసం సాగిన వీరనారి పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.**

**– రజక జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలిశాల రాజేష్**

సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)



భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజక జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలిశాల రాజేష్ అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని ఇల్లందలో ఆయన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలిశాల రాజేష్ మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీ, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ, ధైర్యం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. రజకుల అభ్యున్నతి, సామాజిక గౌరవం కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇల్లంద రజక కుల పెద్దమనిషి మునుకుంట్ల సూరయ్య, పరకాల యాదగిరి, పరకాల రాజు, మునుకుంట్ల రాజు, మునుకుంట్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజి ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**– ప్రజా సమస్యలను కలంతో ప్రశ్నించిన ప్రజాకవి చిరస్మరణీయం**

**– వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి**



సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. కాళోజి నారాయణరావు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ.. కాళోజి నారాయణరావు చేసిన సామాజిక సేవలు, తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు అందించిన సేవలను స్మరించుకున్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, సామాజిక అసమానతలు, అన్యాయాలను కాళోజి నిర్భయంగా ప్రశ్నించారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి తన కలంతో సమాజంలో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడిగా కాళోజి చిరస్మరణీయులని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆయనకు ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. యువత కాళోజి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.

## అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నదానం

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజా కలం:ధరూరు మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణాచార్యులు తెలిపారు. అమావాస్య సందర్భంగా ధరూరు గ్రామానికి చెందిన డి.ఆర్. మంజుల–డి.ఆర్. శ్రీధర్ దంపతులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అర్చకులు కోరారు.



### భూ రీ-సర్వేతో ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్ తో

# కూడిన భూధార్ కార్డులు

**– జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్**



## – రైతుల సమక్షంలో పారదర్శకంగా హద్దుల నిర్ధారణ, అక్కడికక్కడే విస్తీర్ణం వివరాలు

**– మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, మధిర మండలాలలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్**

ఖమ్మం, మధిర, సెప్టెంబరు– 10 ( ప్రజా కలం న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ–సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తి పారదర్శకంగా భూసమస్యలు పరిష్కారం కావలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గం లో గురువారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మధిర మండలం తొండలగోపవరం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పంటపొలాలలో గట్ల వెంబటి నడుచుకుంటూ వెళ్లి రైతుల సమక్షంలో నిర్వహిస్తున్న రీ సర్వే ను క్షుణంగా పరిశీలించారు, అలాగే ఎర్రుపాలెం మండలం తాటిగూడెం రెవిన్యూ పరిధిలోని రాజుపాలెం, వెంకటపురం గ్రామాలలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియ పరిశీలించి రైతులతో కలెక్టర్ నేరుగా ముచ్చటించి సర్వే పై వారి అభిప్రాయాలను తెలుసుకొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గం లో పలు రెవెన్యూ పరిధిలోని గ్రామాలలో భూ సర్వే కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రతి మనిషికి అధార్ లాగా అధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం తో చేస్తున్న భూ సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డు ఉంటుందని తెలిపారు. గ్రామంలో గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, అన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు ఎదుర్కుంటున్న వారికి, అలాగే ఉన్న భూ విస్తీర్ణము కొంతమందికి తక్కువగా నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ–సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రతి రైతుకు ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, ఇరువైపులా పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వే కు నోటీసు ఇచ్చిన రైతులు వారి కుటుంబంలో భూ హక్కదారులు, పట్టా పాస్ బుక్ లో భూమి ఉన్న వారు అందరూ తప్పకుండా సర్వే వచ్చి పూర్తి వివరాలు తెలియజేసి సర్వే కు సహాకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. రైతులకు సందేహం ఉన్న మరొక్కసారి, రైతులు విశ్వసించే వరకు పారదర్శకంగా భూ రీ సర్వే చేసి వారితో స్వయంగా ఉన్న భూమి విస్తీర్ణముకు సంతకం కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ–సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర భూ రికార్డులు సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో భూమి వాస్తవ హద్దులను చూపించి సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాండి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ–సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవోఎన్. శ్రీనివాస్, మధిర తహసీల్దారు రాంబాబు, ఎర్రుపాలెం సునీత ఎలిజబెత్, గ్రామ సర్పంచ్ లు, సంబంధిత అధికారులు, సర్వేయర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

## యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ లో ఓపెన్ – హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఇన్వాసివ్ మిట్రాక్లిప్ ప్రొసీజర్ ద్వారా అరుదైన శాస్త్ర చికిత్స




ఖమ్మం సెప్టెంబర్ 10( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ డాక్టర్ కళా జితేందర్ జైన్ మాట్లాడుతూ గుండె మరియు ఊపిరితిత్తుల సమస్యలతో అత్యంత విషమ స్థితిలో ఉన్న 60 ఏళ్ల పేషేంట్‌కు , యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ, పల్మోనాలజీ బృందాలు విజయవంతంగా 'మినిమల్లీ ఇన్వాసివ్ మిట్రాక్లిప్' ప్రొసీజర్‌ను చేసి ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించాయి . ఆ పేషేంట్ దాదాపు మూడు వారాలుగా వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారు . అంతేకాకుండా , తీవ్రమైన మిట్రల్ రిగర్గిటేషన్ (MR – గుండె కవాటం సమస్య)తో బాధపడుతున్నారు . దీనివల్ల ఆయనకు పదే పదే హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఎదురైంది . పేషేంట్ గుండెలోని మిట్రల్ వాల్వ్ సరిగ్గా మూసుకోకపోవడం వల్ల , రక్తం వెనక్కి ప్రవహించి గుండెపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది . పేషేంట్ యొక్క విషమ పరిస్థితి , ఊపిరితిత్తుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని , డాక్టర్లు మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిని ఎంచుకున్నారు . ఓపెన్ – హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే మిట్రల్ రిగర్గిటేషన్‌ను తగ్గించే ఈ 'మిట్రాక్లిప్' ప్రొసీజర్‌ను కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళా జితేందర్ జైన్ మరియు కార్డియాలజీ బృందం, సీనియర్ కన్సల్టెంట్ (క్లినికల్ & ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ) డాక్టర్ వి. నాగార్జున మాటూరు మరియు క్రిటికల్ కేర్ బృందంతో సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా పూర్తి చేశారు . పేషేంట్ పరిస్థితి చాలా విషమంగా ఉండటం , తీవ్రమైన మిట్రల్ రిగర్గిటేషన్ , ఊపిరితిత్తుల సమస్యలు ఉండటం , అలాగే కొన్ని వారాల పాటు వెంటిలేటర్ పైనే ఉండటం వల్ల ఇది చాలా సవాలుతో కూడుకున్న కేసు . ఇలాంటి హై – రిస్క్ పేషేంట్లకు , సాధారణ ఓపెన్ – హార్ట్ సర్జరీకి బదులుగా మిట్రాక్లిప్ లాంటి మినిమల్లీ ఇన్వేసివ్ విధానం ఒక మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది . ఈ ప్రొసీజర్ విజయవంతం కావడంతో పేషేంట్ గుండె పరిస్థితి మెరుగుపడింది . అలాగే పెద్ద సర్జరీ వల్ల వచ్చే ప్రమాదాలను నివారించి , పేషేంట్ త్వరగా కోలుకునేలా చేయగలిగాము," అని అన్నారు . ఈ ప్రొసీజర్ తర్వాత , పేషేంట్ ఆరోగ్య పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. చికిత్స జరిగిన కేవలం నాలుగు రోజులకే ఆయనను హాస్పిటల్ నుండి విజయవంతంగా డిశ్చార్జ్ చేశారు . యశోద హాస్పిటల్స్ యొక్క మల్టీడిసిప్లినరీ విధానం , అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సామర్థ్యాలు , అలాగే కార్డియాక్, పల్మనరీ మరియు క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో అత్యంత సంక్లిష్టమైన , హై–రిస్క్ గుండె పేషేంట్లకు సైతం మెరుగైన చికిత్స అందించగల సత్తాకు ఈ విజయమే ఒక నిదర్శనం అని అన్నారు . ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ప్రతి నెల 2వ – 4వ బుధవారాలు అందుబాటులో ఉంటానని తెలిపారు . ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్స్ డి. బాలరాజు , డి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

## దళితుల హక్కులను అవమానించొద్దు

**– కులవివక్షకు తెలంగాణలో స్థానం లేదు**

**– కాంగ్రెస్ పార్టీ ఐనవోలు గ్రామ యువత అధ్యక్షులు తాటికాయల ప్రశాంత్**



అయినవోలు, సెప్టెంబర్ 10:–(ప్రజా కలం ప్రతినిధి)

ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు తమ సమస్యలపై నిరసన తెలిపిన అనంతరం వారు నడిచిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేశారనే ఘటనను అయినవోలు మండల్ యూత్ కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఇది నిజమైతే దళితుల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను అవమానించడమేనని యువజన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఆదేశాల మేరకు, అయినవోలు మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్ సూచనలతో అయినవోలు గ్రామ యూత్ అధ్యక్షుడు తాటికాయల ప్రశాంత్ మాట్లాడుతూ, రాష్ట్రం లో దళితులకు దానం కాదు.. హక్కులు కావాలి

దళితులు ఎవరి దయాదాక్షిణ్యాలు కోరడం లేదని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, గౌరవం, సమానత్వం కోసం ప్రశ్నిస్తున్నారని యూత్ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. కులవివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. దళితులను అవమానించే కులవివక్షకు తెలంగాణ సమాజంలో ఇక స్థానం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత ఉపాధ్యక్షులు కొండేటి దిలీప్ యువజన నాయకులు ఎడ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

**– చాకలి ఐలమ్మకు నివాళులర్పించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీకాంత్**



ఆళ్లపల్లి, సెప్టెంబర్ 10, ప్రజాకలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అన్నారు. నిజాం నిరంకుశ పాలనలో దేశ్‌ముఖ్‌లు, జమీందారులు, భూస్వాములు సాగించిన దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడిన ధీరవనిత అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం, చేసిన త్యాగాలు చిరస్మరణీయమని వాసం శ్రీకాంత్ అన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని వాసం శ్రీకాంత్ తెలిపారు.

అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బూరుగడ్డ సత్యరాజు, బూరుగడ్డ రాములు, గడ్డం కృష్ణ, బూరుగడ్డ కృష్ణ, బూరుగడ్డ శ్రీకాంత్, బూరుగడ్డ సాంబయ్య, బూరుగడ్డ సమ్మయ్య, నవీన్, సతీష్, బూరుగడ్డ నాగేష్, తులం శ్రీను, ఆరీఫ్, తెలగాని రాము, అనీఫ్, గుండెబోయిన రామకృష్ణ, అడ్డు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, రజక సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## ఎమ్మెల్సీ మధుపై సస్పెన్షన్.. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు!

**– పోశమ్మ మైదాన్‌లో స్వీట్లు పంచుకుని.. డీజే పాటలకు నృత్యాలు**

సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్)

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ శ్రేణులు నినదించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పోశమ్మ మైదాన్ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మధును సస్పెండ్ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేపాక సమ్మయ్య మాట్లాడుతూ.. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# అయ్యప్ప స్వామికి ఘనంగా పంచామృత అభిషేకాలు

### అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరి పై ఉండాలి - ఎన్ సి సంతోష్

గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాసం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్ సి రాజమౌళి,అనసూయ, వారి కుమారుడు ఎన్ సి సంతోష్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు కైలాస ప్రభాకర్ పద్మ దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి, పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్,ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ,శ్రావణమాసం ప్రతిరోజు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ దైవభక్తి సేవ గుణం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్,కోశాధికారి నారాయణరెడ్డి,సీనియర్ నాయకులు, మరియాల శ్రీనివాస్,గందె యాదగిరి, దేవానంద్,కైలాస ప్రశాంత్,ఉమేష్, డెంటల్ శ్రీనివాస్,గందె సంతోష్,ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సిద్దిపేట జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడిగా ప్రశాంత్ రాచకొండ

### నియామకంపై గజ్వేల్‌లో కార్యకర్తల సంబరాలు

గజ్వేల్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి):



సిద్దిపేట జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడిగా రాచకొండ ప్రశాంత్‌ను నియమించారు. ఈ మేరకు ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు యెడవెల్లి వెంకటస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు యెడవెల్లి వెంకటస్వామికి ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని,విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ఆయన అన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఎన్ ఎస్ యు ఐ లో చేరి విద్యార్థుల హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రశాంత్ నియామకంపై గజ్వేల్‌లోని ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

# బాక్సింగ్‌లో సత్తా చాటిన హేమంత్

### సౌత్ జోన్‌లో స్వర్ణం.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

### హేమంత్‌ను సన్మానించిన ఆదిత్యరెడ్డి

పటాన్‌చెరు సెప్టెంబర్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరుకు చెందిన యువ బాక్సర్ బచ్చు హేమంత్ ముదిరాజ్ బాక్సింగ్‌లో సత్తా చాటాడు. సౌత్ జోన్ స్టేట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50–-55 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున హేమంత్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ముదిరాజ్ భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి పాల్గొని హేమంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు హేమంత్ సాధించిన విజయాన్ని అభినందించిన ఆదిత్యరెడ్డి, జాతీయ స్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువ క్రీడాకారులు హేమంత్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని కోరారు..





# ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి గజ్వేల్ లో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

### నిరుపేద మహిళకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం..

### వైద్యుల ప్రతిభకు అభినందనలు

గజ్వేల్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి గజ్వేల్ లో వైద్యులు క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి నిరుపేద మహిళకు మెరుగైన వైద్య సేవలు అందించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించి ఆమెకు ఉపశమనం కల్పించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన జి. యాదమ్మ (46) గత రెండేళ్లుగా తీవ్రమైన రక్తస్రావం,కడుపుబ్బరం, కడుపునొప్పి, రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గజ్వేల్ జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించారు.

రోగి పరిస్థితిని పరిశీలించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ముందస్తుగా రక్తమార్పిడి,అత్యవసర మందులు అందించి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ మైపాల్ సహకారంతో సంక్లిష్ట శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో సాధారణ వైద్య సేవలతో పాటు క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ప్రజలు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు,నర్సింగ్,ఓటీ,పేషెంట్ కేర్,ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ అభినందించారు. వైద్యుల బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ రాము,డాక్టర్ శ్రీధర్,జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్,అనస్థీషియా వైద్యుడు డాక్టర్ మైపాల్,హెడ్ నర్స్ రాంబాయమ్మ,నర్సింగ్ ఆఫీసర్ యాదమ్మ,ఓటీ టెక్నీషియన్లు రాజు, వెంకట్,పేషెంట్ కేర్ సిబ్బంది రాజు, సంతోష, ఆరోగ్యశ్రీ సిబ్బంది గంగాల సురేందర్,సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం: సర్పంచ్ ఎల్లేష్

### రజక సంఘం ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లో చాకలి ఐలమ్మకు ఘన నివాళి



గజ్వేల్ :10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు, ఆమె సాగించిన వీరోచిత పోరాటం నేటి యువతకు ఎంతో ఆదర్శం, స్ఫూర్తిదాయకమని జగదేవపూర్ మండలం అలీరాజ్ పేట సర్పంచ్ ఎల్లేష్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్లేష్ మాట్లాడుతూ, నాడు దొరల అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తన హక్కుల రక్షణ కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రజక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఐలమ్మ ఆశయ సాధన కోసం రజకులంతా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా రజకుల సంక్షేమానికి, అభివృద్ధికి మరిన్ని నిర్దిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శ్రీధర్, టెంట్ హౌస్ నర్సింలు, ఎన్.ఎస్.యు.ఐ. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రాచకొండ ప్రశాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

### వీరనారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు,పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో గురువారం చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మాబాయి నర్సింగరావు. చాకలి ఐలమ్మ భవనం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి రజక సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు దొరలు,భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా,తన భూమి హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. వెనుకబడిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాజిపేట సర్పంచ్ ఎల్లేష్, రాశీగారి శ్రీధర్, సిద్దిపేట జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు రాచకొండ ప్రశాంత్, ప్రజ్ఞాపూర్‌కు చెందిన టెంట్ హౌస్ నరసింహులు,గజ్వేల్ రజక సంఘం నాయకులు,సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎర్రవాడ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### రాజీ ద్వారా కేసుల పరిష్కారానికి అవకాశం.

### రాయపోల్ ఎస్ఐ మానస.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 10.

సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయపోల్ ఎస్ఐ మానస సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, ఆస్తి విభజన, కుటుంబ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులను ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్నచిన్న కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని ఎస్ఐ మానస పేర్కొన్నారు.






# విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

### - సర్పంచ్ మద్దెల వనజ స్వామి.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 10.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గొడుగుపల్లి సర్పంచ్ మద్దెల వనజ స్వామి అన్నారు. గురువారం గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యూనిఫాంలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరి గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, వీవోఏ సౌజన్య, పీఏసీఎస్ డైరెక్టర్ నల్ల ఆంజనేయులు, వార్డు సభ్యులు కర్రె మహేష్, దుర్గ నరసింహులు, మంత్రి కరుణాకర్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్‌రెడ్డి, దుర్గని మధుసూదన్, నల్ల మల్లేష్, మద్దెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దొర అహంకారం చూపించారు

సిద్దిపేట: కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు దళిత వ్యతిరేక వైఖరిని మరోసారి బయట పెట్టుకున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు జరిగిన అవమానాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు.

అధికారం ఉందనే అహంకారంతో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా వ్యవహరించారని ఆరోపించారు.

నేరెళ్ల ఘటనను మర్చిపోలేం

నేరెళ్ల ఘటనలో దళిత సోదరులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించాయని యాదగిరి గుర్తుచేశారు.

దళితులపై పోలీసుల చర్యల విషయంలో అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక ప్రశ్నలకు తావిచ్చిందన్నారు. దళితుల బాధను అర్థం చేసుకోవాల్సిన పాలకులే వారిపై కఠినంగా వ్యవహరించారని విమర్శించారు.

**సొంత పార్టీ నేతలకే అవమానాలు**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన దళిత మంత్రులు, ప్రజా ప్రతినిధులకు కూడా తగిన గౌరవం దక్కలేదని యాదగిరి ఆరోపించారు. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న వంటి నాయకులను వివిధ సందర్భాల్లో ప్రజావేదికలపై, మీడియా సమావేశాల్లో అవమానించారని విమర్శించారు. ఇది కేవలం వ్యక్తుల అవమానం కాదన్నారు. దళిత నాయకత్వాన్ని చిన్నచూపు చూసే మనస్తత్వానికి ఇది నిదర్శనమని ఆరోపించారు.

స్పీకర్‌పై వ్యాఖ్యలు దురదృష్టకరం

అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనను కూడా యాదగిరి ప్రస్తావించారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రత్యక్ష ప్రసారాలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్యానికి ప్రతీక అని అన్నారు. అలాంటి పవిత్రమైన వేదికపై సభ్యుల మధ్య పరస్పర గౌరవం ఉండాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే దళిత సమాజ ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని యాదగిరి వ్యాఖ్యానించారు.

పసుపు నీళ్ల ఘటనపై ఆగ్రహం

ఈ ఘటనపై దళిత సమాజం ఆవేదనతో నిరసన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే పసుపు నీళ్లు చల్లిన ఘటన చోటుచేసుకుందని యాదగిరి పేర్కొన్నారు.

ఈ చర్య దళిత సమాజాన్ని మరింత బాధించిందన్నారు.

“పసుపు నీళ్లు చల్లడం ద్వారా దొర అహంకారం, అంటరానితనపు మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారు” అని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

దళితులను గౌరవించని రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. దళిత ఆత్మ గౌరవమే కీలకం రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని యాదగిరి గుర్తుచేశారు. కులం, మతం, ప్రాంతం ఆధారంగా ఎవరినీ అవమానించకూడదన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు

దళితులకు ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వ నిర్ణయాలు, దళితులపై జరిగిన ఘటనలన్నింటినీ ప్రజలు పరిశీలిస్తున్నారని యాదగిరి అన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అదే దళితులను అవమానించే రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గత పాలనపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని దేవులపల్లి యాదగిరి స్పష్టం చేశారు.



## చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**వేములగట్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం**

గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో వేములగట్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ దొరల అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని నిర్దిష్ట చర్యలు చేపట్టాలని వారు కోరారు. రజకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు కర్రోళ్ల నర్సింలు,గౌరవ అధ్యక్షులు ప్యాట బాబు,పుల్లయ్యగారి నారాయణ,మంగరి స్వామి,కర్రోళ్ల బిక్షపతి,ముత్తమ్మ,బాలయ్య,తిప్పరం ఆంజనేయులు,కొండరి సత్తయ్య,ప్యాట శ్రీనివాస్,కొండరి కృష్ణ,తీగుల్ల ఎల్లయ్య, పుల్లయ్యగారి బాలలక్ష్మి,తిప్పరం నర్సమ్మతో పాటు రజక సంఘం నాయకులు,గ్రామ పెద్దలు, స్థానిక యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిమ్స్‌లో నర్సారెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**త్వరగా కోలుకుని ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్ష**

గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి సందర్భంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డిని కాంగ్రెస్ నాయకులు



పరామర్శించారు. పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నక్క సంతోష,రాములు గౌడ్, మన్నె కృపానందం తదితరులు నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను,కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సారెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెప్పి, త్వరితగతిన ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షించారు

## దళితులను అవమానిస్తే సహించేది లేదు

**- బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ దళిత నాయకులు**

గజ్వేల్ నియోజకవర్గం:10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ దళిత నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దళిత నాయకుల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందూరి ఐలయ్య మాట్లాడుతూ దళిత సోదరులు వెయ్యి డప్పులతో శాంతియుతంగా నిరసన తెలిపిన అనంతరం,గ్రామాన్ని పసుపు నీటితో శుద్ధి చేశారనే ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్య దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దళితులను అవమానించిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు రాజలింగం,కర్రోళ్ల ప్రవీణ్,మార్పాక శివకుమార్, దయాకర్,ఎర్ర రాజు, రత్నేష్, భరత్,ఆంజనేయులు, నరేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి,రాగం వెంకట్,బింగి నరేష్,సున్నం నాగరాజు,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## అల్మాస్ గూడలో రూ.30 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

**ఏఐసీసీ - విచార్ విభాగ్ కోఆర్డినేటర్ శ్రీ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి**



మహేశ్వరం, సెప్టెంబర్ 10,(ప్రజా కలం)

అల్మాస్ గూడ వాసుల చిరకాల రహదారి కష్టాలకు తెరపడింది. హైమాత్ టెంపుల్ నుండి కోమటికుంట చెరువు వరకు రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన జరిగింది. ఏఐసీసీ – విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విశాఖ నగర్ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన రహదారి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను వారు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. లక్ష్మారెడ్డి గారు అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రహదారి అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహేశ్వరం ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే తన బాధ్యతని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారిపై విమర్శలు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు సమస్యను ఆమె ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపడుతుంటే, తమ సొంత నిధులతో లేదా బీఆర్ఎస్ నిధులతో చేసినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. శంకుస్థాపన చేయడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పనులు పూర్తి చేయడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. మన డివిజన్‌లో నీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి ప్రధాన సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని, అల్మాస్ గూడ అంబేద్కర్ సెంటర్ నుండి గుర్రంగూడ రోడ్డులోని శివాలయం వరకు రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, విశాఖ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బొజ్జ రవీందర్ రెడ్డి, రవి నాయక్, జైపాల్ నాయక్, సిద్దారెడ్డి, యాదగిరి, వేమిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మార్కెట్ కూల్చొద్దు.. ప్రత్యామ్నాయం చూపించండి

**- పాతూర్ రైతుల డిమాండ్‌కు బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి మద్దతు**

**- ప్రత్యామ్నాయం లేకుండా మార్కెట్ కూల్చితే 500 మంది రైతులతో రాజీవ్ రహదారిపై ధర్నా**



గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

రాజీవ్ రహదారి పక్కన ఉన్న పాతూర్ కూరగాయల మార్కెట్‌ను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కూల్చివేయొద్దని పాతూర్ రైతులు అధికారులను కోరారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తూ సుమారు 300 రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, మార్కెట్‌ను తొలగిస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రాజీవ్ రహదారిపై కూరగాయలు, మొక్కజొన్న, పండ్లు విక్రయిస్తూ రైతులు ప్రమాదాలకు గురయ్యేవారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో మంత్రి హరీశ్‌రావు రూ. 1.50 కోట్లతో పాతూర్ మార్కెట్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారని, అప్పటి నుంచి రైతులు సురక్షితంగా తమ ఉత్పత్తులను విక్రయించుకుంటున్నారని పేర్కొన్నారు.

పాతూర్ మార్కెట్‌కు మంచి గుర్తింపు ఉందని, హైదరాబాద్–ఆదిలాబాద్ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇక్కడ తాజా కూరగాయలను కొనుగోలు చేస్తుంటారని వంటేరు తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీటి సరఫరా కోసం పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం అవసరమేనని, అయితే మార్కెట్‌ను కూల్చివేయకుండా ప్రత్యామ్నాయ మార్గంలో పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌ను తొలగిస్తే సుమారు 300 రైతు కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మార్కెట్‌ను కూల్చివేస్తే సహించేది లేదని, ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతకు ప్రయత్నిస్తే రైతులతో కలిసి రాజీవ్ రహదారిపై ధర్నా,నిరసన చేపడతామని వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. అవసరమైతే 500 మంది రైతులతో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని,వారి సమస్య పరిష్కారం కోసం తాను అండగా ఉంటానని వంటేరు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింగరావు,లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ కొలిచెలిమి స్వామి, పాతూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేశం,పాతూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.




## నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలి

**- మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి - సీఐ రాఘవేందర్ రెడ్డి**

మహేశ్వరం, సెప్టెంబర్ 10, (ప్రజా కలం)

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ ఏసీపీ జానకి రెడ్డి సూచించారు. గురువారం మహేశ్వరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో గణేష్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏసీపీ సూచనలు:

ప్రతి మండపానికి పోలీసుల అనుమతి తప్పనిసరి. ఆన్‌లైన్‌లో పోలీస్




పోర్టల్ ద్వారా మండపం ఏర్పాటు, విగ్రహం ఎత్తు, నిమజ్జన తేదీ వివరాలు ముందుగానే నమోదు చేయాలి. నాణ్యమైన విద్యుత్ వైరింగ్, ఫైర్ సేఫ్టీ, అత్యవసర మార్గాలు, సీసీ కెమెరాలు, నీటి సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలి. మండపాల వద్ద 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ల వినియోగం నిషేధం. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు. మద్యం, మత్తు పదార్థాలు, పేకాట, వివాదాస్పద ప్రసంగాలకు దూరంగా ఉండాలి.

ఈ సందర్భంగా సీఐ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, ఊరేగింపులో డప్పు, సాంప్రదాయ వాయిద్యాలతోనే నిమజ్జనం చేయాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ గోపాలకృష్ణ, ఏఈ చక్రపాణి, ఎంపీడీఓ సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్, పీహెచ్సీ సూపరింటెండెంట్ రాజగోపాల్, ఫైర్ స్టేషన్ ఏఎస్ఐ, ఎస్ఐలు రాఘవేందర్, ధనుంజయ్, మారయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**- వేములగట్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం**

గజ్వేల్:10 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో వేములగట్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా



నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ దొరల అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని నిర్దిష్ట చర్యలు చేపట్టాలని వారు కోరారు. రజకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు కర్రోళ్ల నర్సింలు,గౌరవ అధ్యక్షులు ప్యాట బాబు,పుల్లయ్యగారి నారాయణ,మంగరి స్వామి,కర్రోళ్ల బిక్షపతి,ముత్తమ్మ,బాలయ్య,తిప్పరం ఆంజనేయులు,కొండరి సత్తయ్య,ప్యాట శ్రీనివాస్,కొండరి కృష్ణ,తీగుల్ల ఎల్లయ్య, పుల్లయ్యగారి బాలలక్ష్మి,తిప్పరం నర్సమ్మతో పాటు రజక సంఘం నాయకులు,గ్రామ పెద్దలు, స్థానిక యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా: ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

గజ్వేల్: 10సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన సందనబోయిన నర్సింలుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి గురువారం గజ్వేల్ పట్టణంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేదలకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక మంది నిరుపేదలకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్న ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి,కర్ణాకర్,కనకరాజు పరుశురాం,తుమ్మ శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.





## వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

### -ఘనంగా నివాళులు అర్పించిన బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 10,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్పేట చాపల మండి వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "ఒక భూస్వామి వద్ద పొలాన్ని కౌలుకు తీసుకొని పంట పండిస్తున్న ఆమెను చూసి ఓర్వలేక దురహంకార దొరలు పంటపై దాడి చేస్తే, 'దొరా.. మేము పండించిన పంట నా కష్టార్జితం' అని నడుము బిగించి దొరలను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ.తన లాభం, తన స్వార్థం, తానే జీవించాలనే ఈ రోజుల్లో.. భూమి లేని పేదల కోసం పోరాటం చేసి, భూమి మాకు జీవనాధారం అని నినదించి, వీరమరణం పొందిన మహిళ చాకలి ఐలమ్మ. ఆమె మహిళా లోకానికి ఒక గొప్ప స్ఫూర్తి, ఒక గొప్ప నిదర్శనం.ఐలమ్మ స్ఫూర్తిని మనందరం కొనసాగించాలి" అని అన్నారు.

## వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

### -సీపీఐ మండల కార్యదర్శి కొమ్ము గళ్ళరాజు

కందుకూరు, సెప్టెంబర్ 10: (ప్రజా కలం)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం కందుకూరు మండల




కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ము గళ్ళరాజు ముఖ్య అతిథిగా పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, దొరల గడీల అకృత్యాలకు వ్యతిరేకంగా ఎర్రజెండా అండతో చాకలి ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు."భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ పాత్ర అత్యంత ఘనమైనది. 'నా భూమిలో పండిన పంట నాదే' అంటూ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆమె ధైర్యం, తెగువ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు.పీడిత ప్రజల హక్కుల కోసం, శ్రామిక వర్గాల విముక్తి కోసం రాజీలేని పోరాటాలు కొనసాగించడమే ఆ వీరనారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సంసన్, రాహుల్, రవి, మరియమ్మ, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మకు ఘన నివాళి

### -అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 10(ప్రజా కలం) ప్రతినిధి

అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా పటాన్‌చెరు డివిజన్‌లోని రజక సంఘం కార్యాలయం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఐలమ్మ చిత్రపటానికి శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ధైర్యసాహసాలను స్మరించుకున్నారు.సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా నిలిచి, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మహేష్,సంఘం ప్రతినిధులు, నాయకులు, సభ్యులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు..



# నీళ్లతో శుద్ధీకరణ చేయడం దారుణం

## - బీఆర్ఎస్ వైఖరిని ప్రశ్నించాలి

### మహేశ్వరం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారిగళ్ళ లాజర్ ఫైర్



మహేశ్వరం,
సెప్టెంబర్ 10 (ప్రజాకలం):

మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫామ్ హౌస్ సమీపంలో దళితులు నడిచారని పేర్కొంటూ బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం అత్యంత అవమానకరమైన, అమానవీయమైన చర్య అని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారిగళ్ళ లాజర్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినా, ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రజలు నడిచిన ప్రదేశాన్ని 'శుద్ధి' చేయాల్సిన అవసరం ఉందనే భావన వ్యక్తం చేయడం కుల వివక్షను ప్రతిబింబిస్తోందన్నారు.ఇది కేవలం దళితులనే కాదు, భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించే చర్యగా భావిస్తున్నామని ఆయన అన్నారు."దళితులు ఈ దేశ పౌరులు. వారికి ఎక్కడ నడవాలి, ఎక్కడ నిలబడాలి అనే హక్కులను ఎవరూ ప్రశ్నించలేరు. 'దళితులు నడిచినందుకు శుద్ధీకరణ' వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వానికి పూర్తిగా విరుద్ధం" అని లాజర్ అన్నారు.ఇలాంటి చర్యలను ఖండించకుండా ప్రోత్సహించడం బీఆర్ఎస్ పార్టీ నైజాన్ని ప్రశ్నించేలా ఉందని, దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఉన్న వైఖరి ఏమిటి? కుల వివక్షకు వ్యతిరేకంగా పార్టీ స్పష్టమైన విధానం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉందని ఆయన డిమాండ్ చేశారు.

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా సహించేది లేదని, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను కాపాడేందుకు దళిత సమాజం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతుందని స్పష్టం చేశారు. కుల వివక్షకు తావులేని సమాజం కోసం, సమానత్వం కోసం, దళితుల ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ గొంతెత్తాలని లాజర్ పిలుపునిచ్చారు.

# ప్రతి ఇంటికి 'బాకీ కార్డుల పంపిణీ

## - మాధవరం రంగారావు



కూకట్ పల్లి,
సెప్టెంబర్ 10, ప్రజా కలం ప్రతినిధి:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు మరియు ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి, వెయ్యి రోజులు (1000)గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ప్రభుత్వం ప్రజలకు బాగ్గిపడ్డ కార్డులను రిక్షా పుల్లర్స్ కాలనీ లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి బాకీ కార్డులను పంపిని చేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి అధికారాన్ని అప్పగించారని అన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి సుమారు వెయ్యి రోజులు గడుస్తున్నా అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు.మహిళలకు, రైతులకు, యువతకు, నిరుద్యోగులకు, పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడానికే ప్రతి ఇంటికి వెళ్లి 'బాకీ కార్డులు' అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, ఆంజనేయులు ప్రవీణ్, విక్రమ్, కిరణ్, రవి, శానప్ప, రాజు, శేఖర్, యాదగిరి, ఆనంద్, వెంకన్న, జగదీష్, చందు, రామ్మూర్తి, శైలజ, కుమార్, నగేష్, సంతోష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్, డీఈవో

### - విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### - అదనపు కలెక్టర్ కిరణ్మయి



బాలాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం):

విద్యార్థులలో ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు.

గురువారం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లెలగూడ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను రంగారెడ్డి అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి కృష్ణలతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన కార్యక్రమం విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న పునరభ్యసన తరగతులు, విద్యార్థుల ప్రాథమిక అభ్యసన స్థాయిని అంచనా వేసేందుకు రూపొందించిన ప్రాథమిక స్థాయి నివేదిక తదితర విద్యా కార్యక్రమాలను అధికారులు పరిశీలించారు. అలాగే విద్యార్థుల అభ్యసన ప్రగతి, తరగతి గది బోధనా విధానాలు, విద్యార్థుల హాజరు, అభ్యసన లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చేపడుతున్న తదితర కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు.

అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి, ప్రతి విద్యార్థి అభ్యసన ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అందించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను పరిశీలించారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, పౌష్టికాహారాన్ని స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.




## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 10.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని రాయపోల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ సెక్రటరీ గౌరీ పరుశురాములు, జిల్లా యువజన నాయకులు చింతకింది కర్ణాకర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక అసమానతలను తొలగించి అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ యువజన నాయకులు గల్వ దయాకర్‌రెడ్డి, రజక సంఘం సీనియర్ నాయకులు చెప్పాల స్వామి, రజక సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా  చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం

మెదక్ (ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 10 చాకలి ఐలమ్మ 41 వర్ధంతి రేగోడు మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా  మండల రజక



సంఘం అధ్యక్షులు రాములు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి  కోసం పోరాడిన  వీర వనిత చాకలి ఐలమ్మ తెలంగాణ రైతంగ సాయుధ పోరాట సమయంలో చాకలి ఐలమ్మ చూపిన తెగువ బావి తరతరాలకు స్ఫూర్తిదాయకం ఆ రోజుల్లో దొరల పెత్తనాన్ని ధిక్కరించి బహుజన వీర వనితగా అనేక ప్రజా పోరాటాలకు స్ఫూర్తి విసునూరు దొర గుండాలనేదిరించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ గ్రామాల  రజకులు పాల్గొన్నారు

## ప్రపంచ వేదికపై గీతం జెండా..

### - పికిల్ బాల్ ప్రపంచకప్‌లో రెండు పతకాలతో సత్తా

పటాన్‌చేరు, సెప్టెంబర్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

వియత్నాంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పికిల్ బాల్ ప్రపంచ కప్--2026 పోటీల్లో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ బీబీఏ తొలి సంవత్సరం విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల రెండు పతకాలు సాధించి సత్తా చాటారు.18 ఏళ్ల లోపు బాలికల విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆశ్రిత,బాలికల వ్యక్తిగత విభాగంలో రజత పతకం,జంట విభాగంలో కాంస్య పతకం సాధించారు ఒకే అంతర్జాతీయ క్రీడా పోటీలో వ్యక్తిగత,జంట విభాగాల్లో పతకాలు సాధించడం ఆశ్రితకు ప్రత్యేక ఘనతగా నిలిచింది. కఠోర సాధన,క్రమశిక్షణ, పట్టుదల,క్రీడపై ఉన్న ఆసక్తితో ప్రపంచ వేదికపై విజయాన్ని అందుకున్నారు.చదువుతో పాటు క్రీడా రంగంలోనూ ప్రతిభను చాటుకుంటూ గీతం విద్యార్థులకు ఆశ్రిత స్ఫూర్తిగా నిలిచారు.అంతర్జాతీయ పోటీలో గీతానికి ప్రాతినిధ్యం వహించి రెండు పతకాలు సాధించడం పట్ల గీతం నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఆశ్రిత అంకితభావం, క్రీడా స్ఫూర్తి, ప్రతిభను అభినందించింది. భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించింది. వియత్నాంలో ఆశ్రిత కనబరిచిన ప్రతిభ వర్ధమాన యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. నిరంతర సాధన, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆమె విజయం చాటిచెప్పింది..



# న్యూ శాయంపేట పోచమ్మ బోనాలకు ప్రత్యేకత

## - ఊరంతా ఒక్కటై.. పోచమ్మ తల్లి సన్నిధికి భక్తజనం
## - ఆకట్టుకున్న యాదవుల జోడీ మేకపోతుల బండి.. వైభవంగా పోచమ్మ తల్లి ఊరేగింపు





న్యూ శాయంపేట
సెప్టెంబర్ 10 ప్రజా కలం ప్రతినిధి

శ్రావణమాసం వచ్చిందంటే తెలంగాణ పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో శ్రావణమాసంలో గ్రామదేవతలైన పోచమ్మ,ఎల్లమ్మ తదితర అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రావణమాసం ప్రారంభం నుంచి బుధ, గురు,ఆదివారాల్లో వివిధ ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించడం సాధారణం. అయితే వరంగల్ నగర పరిధిలోని న్యూ శాయంపేటలో మాత్రం పోచమ్మ బోనాలకు ఒక ప్రత్యేకమైన సంప్రదాయం ఉంది. శ్రావణమాసం చివరి గురువారం రోజున ఊరంతా ఒకేరోజు సామూహికంగా పోచమ్మ బోనాలు నిర్వహించడం న్యూ శాయంపేట ప్రత్యేకతగా నిలుస్తోంది. కులమత భేదాలకు అతీతంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకోవడం ప్రతి ఏడాది ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోంది.

**ఊరంతా పండుగ వాతావరణం**

బోనాల సందర్భంగా న్యూ శాయంపేటలో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్లను శుభ్రం చేసుకుని, మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను సిద్ధం చేసుకున్నారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలతో మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పులు, వాయిద్యాల మోత, భక్తుల నినాదాలతో న్యూ శాయంపేట వీధులు మార్మోగాయి. అమ్మవారి రూపమైన విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**ఆకట్టుకున్న యాదవుల జోడీ మేకపోతుల బండి**

న్యూ శాయంపేట పోచమ్మ బోనాల సందర్భంగా యాదవుల జోడీ మేకపోతుల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ పద్ధతిలో అలంకరించిన జోడీ మేకపోతుల బండి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బోనాల ఊరేగింపులో ఈ బండి ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో స్థానికులు, భక్తులు ఆసక్తిగా తిలకించారు. తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రతి ఏడాది బోనాల సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు**

న్యూ శాయంపేటలో నిర్వహించిన పోచమ్మ బోనాల కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాం రెడ్డి బట్టి శీనన్న స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్ వేల్పుల మోహన్ రావు తదితరులు బోనాల కార్యక్రమంలో పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ**

పోచమ్మ తల్లికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, వేపాకులు తదితరాలతో బోనాలను అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. తమ కుటుంబాలు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల అనంతరం భక్తులు అమ్మవారి ఆలయ పరిసరాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయ ఆచారాల్లో భాగంగా మేకలు, గొర్రెపోతులు, కోళ్లను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు**

న్యూ శాయంపేటలో జరిగే పోచమ్మ బోనాలు కేవలం ఒక మతపరమైన కార్యక్రమంగా కాకుండా స్థానిక ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఒకేరోజు ఊరంతా కలిసి బోనాలు నిర్వహించడం వల్ల గ్రామంలో సామూహిక భావన మరింత బలపడుతోంది. శ్రావణమాసం చివరి గురువారం రోజున జరిగే ఈ వేడుక కోసం స్థానికులు ముందుగానే ఏర్పాట్లు చేసుకుంటారు. ప్రతి ఇంటి నుంచి బోనం తీసుకురావడం, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం, యువత ఉత్సాహంగా ఊరేగింపులో భాగస్వాములు కావడం వంటి దృశ్యాలు పండుగకు మరింత శోభను తీసుకొచ్చాయి.

**పాత సంప్రదాయానికి కొత్త ఉత్సాహం**

ఆధునిక జీవన విధానం వేగంగా మారుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా వస్తున్న పండుగలు, ఆచారాలను ప్రజలు కొనసాగించడం విశేషం. న్యూ శాయంపేటలో పోచమ్మ బోనాలు కూడా అలాంటి సంప్రదాయాల్లో ఒకటి. పెద్దలు పాటిస్తున్న ఆచారాలను యువత కూడా కొనసాగిస్తూ బోనాల నిర్వహణలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో పోచమ్మ బోనాల పండుగకు ప్రతి ఏడాది కొత్త ఉత్సాహం వస్తోంది.

**భక్తులతో కిటకిటలాడిన న్యూ శాయంపేట**

బోనాల సందర్భంగా న్యూ శాయంపేటలోని ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి విగ్రహం ఊరేగింపు సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. డప్పుల మోతకు యువత ఉత్సాహంగా సందడి చేయగా, మహిళలు బోనాలతో అమ్మవారిని కీర్తిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులు సైతం ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొనడంతో న్యూ శాయంపేటలో పండుగ వాతావరణం నెలకొంది.

**ఐక్యతను చాటిన బోనాల వేడుక**

న్యూ శాయంపేట పోచమ్మ బోనాలు స్థానికుల ఐక్యతకు ప్రతిబింబంగా నిలిచాయి. ఊరంతా ఒకేరోజు బోనాలు నిర్వహించుకోవడం ద్వారా తమ ప్రాంత ప్రత్యేకతను చాటుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, యువత, భక్తులు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు, పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మొత్తంగా.. న్యూ శాయంపేటలో శ్రావణమాసం చివరి గురువారం నిర్వహించిన పోచమ్మ బోనాలు భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. ఊరంతా ఒక్కటై అమ్మవారి సన్నిధికి చేరి బోనాలు సమర్పించడం, యాదవుల జోడీ మేకపోతుల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలవడం, ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడంతో ఈ ఏడాది పోచమ్మ బోనాలు మరింత వైభవంగా జరిగాయి.

# ఎన్‌ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 11 (ప్రజాకలం ప్రతినిధి):



ఎన్ఎస్‌యూఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎన్‌ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ భయ్యా, తెలంగాణ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ అక్బర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ.. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఎన్‌ఎస్‌యూఐని మరింత బలోపేతం చేస్తానని రాకేష్ ముదిరాజ్ పేర్కొన్నారు.

# వినాయక పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి:

## కుత్బుల్లాపూర్ ఏసిపి బాల గంగిరెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు మరియు ప్రజలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులతో కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసిపి బాల గంగిరెడ్డి మాట్లాడుతూ... పండుగను ప్రశాంతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు



అవసరమైన పలు సూచనలు చేశారు. అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్స్, వాయిద్యాలను వినియోగించవద్దని, సాధ్యమైనంత వరకు సంప్రదాయ బ్యాండ్ మరియు సంప్రదాయ వాయిద్యాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. పండుగ సందర్భంగా మద్యం సేవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అసాంఘిక లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎసిపి నిర్వాహకులకు భక్తులకు సూచించారు. అదేవిధంగా, వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు ఇతర నిమజ్జన ప్రదేశాల వద్ద భక్తుల భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు. వినాయక చవితి పండుగను శాంతియుతంగా, సురక్షితంగా సజావుగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎసిపి కోరారు. ఈసమావేశంలో జీడిమెట్ల సిఐ కె.రవి కుమార్, సెక్టార్ ఎస్ఐ ప్రేమ్ సాగర్, శ్రీనివాస్, శ్యామ్ బాబు, రామచంద్రయ్య, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల ఇద్దరు దొంగల అరెస్ట్

## రిమాండ్ కు తరలింపు

మేడిపల్లి సెప్టెంబర్ 10(ప్రజాకలం న్యూస్)

ఆరు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్ చేసి 6 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 9 న మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులపై దర్యాప్తు చేపట్టిన మేడిపల్లి పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వి. విజేందర్ ఏ రాజేంద్ర,వయస్సు 30 సంవత్సరాలు, వృత్తి:కూరగాయల వ్యాపారం,శ్రీపుర్ కాలనీ,పీర్జాదిగూడబసంత్ ముదులి, 22 సం:లేబర్, తుక్కుగూడ, బలుగాం,గంజాం జిల్లా,ఒడిశా నిందితులు ఆరు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో నిందితుల నుండి 6 దొంగిలించబడిన ద్విచక్ర వాహనాలను, సుమారు రూ.4,20,000/- విలువైన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.1. 02 హోండా యాక్టివా స్కూటర్లు.2. 01 హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్,3. 01 హీరో ప్యాషన్ మోటార్ సైకిల్,4. 01 హోండా షైన్ మోటార్ సైకిల్, 5.01 జావా మోటార్ సైకిల్ నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులను పట్టుకోవడంతో పాటు దొంగిలించబడిన 06 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన మేడిపల్లి క్రైమ్ టీమ్ సిబ్బందిని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ జలంధర్ రెడ్డి అభినందించారు.

ప్రజలకు మేడిపల్లి పోలీసుల విజ్ఞప్తి

ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలను సురక్షితంగా లాక్ చేయాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా వాహన దొంగతనం జరిగినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని మేడిపల్లి పోలీసులు కోరారు.



# మట్టి వినాయకులతో ప్రకృతిని కాపాడుదాం

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాట్ల యాదయ్య గౌడ్



మహేశ్వరం, సెప్టెంబర్ 10 (ప్రజా కలం): రాబోయే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాట్ల యాదయ్య గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ విగ్రహాలు, హానికరమైన కెమికల్ రంగుల వల్ల మన ఆరోగ్యంతో పాటు చెరువులు, కుంటలు, నీటి వనరులు, ప్రకృతి తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక చవితి నవరాత్రుల పూజల సందర్భంగా చుట్టుపక్కల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, భక్తులు చొరవ చూపాలని కోరారు. మన సంప్రదాయం, మన ప్రకృతి రెండూ మట్టిలోనే ఉన్నాయని, పూర్వం నుండి మన పూర్వీకులు మట్టి విగ్రహాలనే పూజించేవారని గుర్తు చేశారు. కాబట్టి స్వచ్ఛమైన మట్టి వినాయకులను పూజించి, నిమజ్జనం తర్వాత ఆ మట్టి తిరిగి ప్రకృతిలో కలిసేలా చేద్దామని పిలుపునిచ్చారు. ఇది భక్తితో పాటు బాధ్యత కూడా అని ఆయన వినాయక ఉత్సవ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఈ పండుగ వేళ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ గణనాథుడిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

## దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 10.

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని అన్నారు. వడ్డేపల్లి గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



జాల దుర్గాప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు తపటి సుధాకర్, నాయకులు కురుమ నర్సింలు, ఆంజనేయులు, గుమ్మడి కుమార్, నీరుడు నరేష్, గడిల సత్తయ్య, నీరుడు స్వామి, చెట్టే మల్లయ్య, కాసా కుమార్, గుమ్మడి నర్సింలు, శ్రీరామ్ శ్రీనివాస్, వడ్డే మల్లేష్, అంకగల లక్ష్మణ్, కుమ్మరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. శంకర్‌పై చర్యలు తీసుకోవాలి.

## కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

## బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఇప్ప దయాకర్.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 10.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విర్లపల్లి శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాయపోల్ మండల బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ఇప్ప దయాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టి, అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మానసకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇప్ప దయాకర్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా ప్రజలను ఏకం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై చావును కోరేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. శంకర్ వెంటనే కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హనుమంతు రాజు, మాజీ ఎంపీటీసీ మాదాసు రాజు, మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, ఉప సర్పంచ్ బందరం సంతోష్, మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గల్వ దయాకర్ రెడ్డి, నాయకులు మాదాసు నవీన్, చింతకింది మంజూర్, మహేష్, రాంపల్లి సతీష్, అశోక్, బాలకృష్ణ, కొంగరి శ్రీకాంత్, నాంసాని స్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# డిచ్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంటనే నూతన సొంత భవనం నిర్మించాలి

## విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి -- PDSU డిమాండ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 10:

డిచ్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంటనే నూతన సొంత భవనం నిర్మించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పి డి ఎస్ యు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టి, జిల్లా అదనపు కలెక్టర్ భుజంగ రావు గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా నాయకులు ఎం. మున్నా కుమార్, తెలంగాణ యూనివర్సిటీ నాయకులు సంజయ్ మాట్లాడుతూ, డిచ్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు పరిమిత సౌకర్యాల మధ్య విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

ప్రస్తుతం ఉన్న తరగతి గదులు అధ్వానస్థితిలో ఉన్నాయని, వర్షం వచ్చినప్పుడు పైకప్పు నుంచి నీరు కారడంతో పాటు రేకులు పగిలి ఉండటంతో వర్షపు నీరు తరగతి గదుల్లోకి వస్తోందన్నారు. విద్యుత్ సమస్యలు, చెత్తాచెదారం పేరుకుపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, సరైన తరగతి గదులు, ఫర్నిచర్ తదితర కనీస మౌలిక సదుపాయాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేర్కొన్నారు.

ఉన్నత విద్యను అందించే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటువంటి పరిస్థితులు కొనసాగడం విద్యార్థుల విద్యాభ్యాసానికి తీవ్ర ఆటంకంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెబుతున్న నేపథ్యంలో డిచ్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కళాశాలకు నూతన సొంత భవనం నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని, అప్పటివరకు ప్రస్తుత తరగతి గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యార్థుల భద్రతను కాపాడాలని కోరారు. అలాగే కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్,




ప్రయోగశాలలు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి గారు తక్షణమే స్పందించి, డిచ్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకువచ్చి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి డిచ్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన సొంత భవనం నిర్మాణ ప్రక్రియను ప్రారంభించకపోతే పి డి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా నాయకులు సృజన్, శ్రీశాంత్, అరవింద్,నితిన్,జీవన్,రాజు, రాజేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కెకె కమిటితో మేం సైతం

## అంటున్న ముంబై అదానీ కార్మికులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 10:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడంలో యోగదానం వహించిన వారి కోసం "కెకె కమిటి" ఏర్పాటు చేయడం మంచి పరిమాణం. వారు నిర్దేశించిన నియమాలు సూచనలకు తాము ముంబైలోని అదానీ కంపెనీ కార్మికులం లోబడి సమాయత్తం అవుతున్నామని అదానీ కంపెనీ డైనమిక్ కార్మిక నాయకుడు సిరిపంగి రవీందర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎంటిజెఏసి ఆధ్వర్యంలో ముంబై శాంతకృజ్ లోని రిలయన్స్ ఎనర్జీ కార్యాలయంలో ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిపంగి రవీందర్ ఇక ముందు మాట్లాడుతూ తాము హైద్రాబాద్ వెళ్ళి అన్ని ఆధారాలతో కెకె కమిటిని త్వరలో కల్సి, మిగతా అనాటి ఉద్యమకారులతో కూడా కలవనున్నట్లు ప్రకటించారు. అదానీ కార్మికుడు ఎంటిజెఏసి నేత కొమ్ము అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అదానీ కంపెనీ కార్మికులు అనేక కుల సంఘాలతో కల్సి పూలే షాహు అంబేద్కర్ల గడ్డయైన ముంబై మహానగరంలో ఉధృత పోరు సల్పిన వారమని చరిత్రను వల్లించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా బిఎస్పీ నాయకులు నాగసేన్ మాలజీ హాజరైయ్యారు. వీటితోపాటు కార్మిక నాయకులు కొరగొని ప్రభు, కాశీంభాయి, కె. రాములు, కె.భాస్కర్, టి.బాబు, భీంరావు మహరాజ్, మేడి సాగర్, కేవడ రాజు పాల్గొన్నారు.

# డీజే లకు అనుమతి లేదు

## భక్తి శ్రద్ధల వాతావరణంలో వినాయక సంబరాలు

## సబ్ ఇన్స్పెక్టర్ జగన్

భూదాన్ పోచంపల్లి సెప్టెంబర్ 10 ( ప్రజా కలం )

గణేష్ ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోచంపల్లి సబ్ ఇన్స్పెక్టర్ జె. జగన్ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలో యువజన సంఘాల నాయకులతో ఎస్సై జగన్ ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, మండపాల ఏర్పాటులో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు




తీసుకోవాలని తెలిపారు. ఈ లింక్ ద్వారా https://policeportal.tspoloce.gov.in అనుమతి తీసుకోవాలని తెలియజేశారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.గణేష్ నిమజ్జనం ఊరేగింపుల సమయంలో డీజేలు, లౌడ్‌స్పీకర్లను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బైక్ స్టంట్లు చేయడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడటం పూర్తిగా నివారించాలని ఆయన అన్నారు. సోషల్ మీడియాలో వదంతులు, ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని, అవసరమైతే ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై జగన్ అన్నారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది ధనంజయ, వినోద్,సాయి,కిరణ్, స్వామి గౌడ్, వెంకటేష్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

## సీఈవో శోభారాణి

భూదాన్ పోచంపల్లి సెప్టెంబర్ 10 ( ప్రజా కలం )

మండల అభివృద్ధికి ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరు అభివృద్ధికి తోడ్పడు ఉండాలని సీఈవో శోభారాణి అన్నారు. గురువారం భుధన్ పోచంపల్లి మండలం పరిషత్ కార్యాలయాన్ని సీఈఓ శోభారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, కార్యాలయ రికార్డులను పరిశీలించి, మండల పరిధిలోని అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లల్లో ఎలాంటి అవాంఛనీయలు జరగకుండా. ఉపాధి హామీ పథకం (EGS), పారిశుధ్య అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమై, గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. విజయ, సూపరింటెండెంట్ ఎ. సత్యనారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అపర్ణ,హౌసింగ్ ఏఈ శివాజీ, ఏపీఓ కృష్ణమూర్తి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 10నుండి 17వరకు వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయండి: సిపిఎం

## కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి




ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు నిజాం. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని వెట్టి చాకిరి నుండి ప్రజల విముక్తి కోసం దొరల నిజాం రజాకార్ సైన్యాలకు ఎదురొడ్డి పోరాడిన వీర వనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా షాపూర్ నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా దగ్గర వీరనారి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలపురం రాజశేఖర్ మాట్లాడుతూ నిజాం నిరంకు శ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములు జమీందార్లు, జాగిర్దారులకు వ్యతిరే కంగా మట్టి మనుషులే సాయుధులై భూమి బుక్తి వెట్టి చాకిరి విముక్తి కొరకు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరులను స్మరించు కుంటూ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 10 నుండి 17 వరకు జయప్రదంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో పుట్టని కొన్ని రాజకీయ పార్టీలు నేడు దాని వారసులమని, అది హిందూ ముస్లింల పంచాయతీగా మార్చి చరిత్రను వక్రీకరించడానికి మతోన్మాద శక్తులు కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. ఈవక్రీకరణలను తిప్పి కొట్టాలన్నారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట వారసులు ముమ్మాటికి కమ్యూనిస్టులేనన్నారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న పది లక్షల ఎకరాల మిగులు భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టుల దేనని అన్నారు. సాయుధ పోరాటంలో 4,000 మంది తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించి 3000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు స్థాపించిన పోరాట చరిత్రను. ముస్లిం రాజుపై హిందువుల విజయం గా వక్రీకరించే పనిలో బిజెపి కొన్ని మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని అలాంటి వాళ్ల కుట్రలను పోరాట వారసత్వం కలిగిన తెలంగాణ ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లింగస్వామి, మండల నాయకులు అంజయ్య, బి.సత్యం, స్వాతి, కరుణాకర్, కే.శీను, తిమ్మప్ప, కనకయ్య, శ్రీశైలం, సత్యం, కృష్ణ, లక్ష్మీనారాయణ, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

## భూస్వామ్య దోపిడీ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనితకు ఘన నివాళి



భూదాన్ పోచంపల్లి సెప్టెంబర్ 10 ( ప్రజా కలం )

భూస్వామ్య దోపిడీకి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఉద్యమించిన వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పోచంపల్లి మండల రజక సంఘం, పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చిట్యాల ఐలమ్మకు ప్రత్యేకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. భూస్వామ్య, ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి పోరాటానికి అండగా నిలిచిన ధీరవనితగా ఐలమ్మను కొనియాడారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆమె ధైర్యాన్ని, స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఐలమ్మ చేసిన పోరాటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల కోసం సాగిన ప్రజా ఉద్యమానికి ప్రతీక అని నాయకులు పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు ఐతరాజు బిక్షపతి, గౌరవ అధ్యక్షుడు చేరాల ప్రకాష్, పోచంపల్లి పట్టణ రజక సంఘం అధ్యక్షుడు చేరాల నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి లింగాల మధుతో, చేరాల లింగయ్య, గోరుగంటి రవీందర్, గరిసె జంగయ్య, లింగాల సురేష్, యంజాల కృష్ణ, ఇబ్రహీంపట్నం అంజయ్య, చింతల ఉపేందర్, బండిరాల సుశీల, లింగాల శ్రీనివాస్, గోరుగంటి దశరథ, గోరుగంటి శ్రీనివాస్, ఎంజాల నగేష్, ఎర్రబోతు మహేష్, చింత కింది సురేష్, కలుకూరి పాండు తదితరులు పాల్గొన్నారు.



# కొలన్ సులోచన మృతికి సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ సంతాపం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే. కొలన్ సులోచన నిన్న అకాల మరణం చెందడంతో, గురువారం ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు. ఈసందర్భంగా సుభాష్ నగర్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సూరారం మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ కొలన్ హన్మంత్ రెడ్డిని పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతిని ప్రగతినగర్ సుందరయ్య భవన్ లో ఘనంగా వర్ధంతి సభ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాలవెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిపిఎం పార్టీ మహిళా నాయకురాలు రామా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ...చాకలి ఐల్లమ్మ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, వీరోచితంగా పోరాటం చేసిన వీరనారి ఐల్లమ్మ అని కొనియాడారు. ఆనాటి తెలంగాణ సమాజాన్ని నిజాం పాలన, మరోవైపు దొరల పెత్తనం, భూస్వాముల, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్న రోజుల్లో, వెట్టిచాకిరీ, మహిళలపై వివక్షతకు గురిచేస్తున్న వ్యవస్థపై ఒక్క మహిళగా తిరుగుబాటు పోరాటాన్ని ఐల్లమ్మ చేసిందన్నారు. పేద రజక కుటుంబానికి చెందిన ఒక మహిళ... దొరల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ "నా కష్టంతో సాగు చేసిన భూమి నా హక్కు అని ప్రశ్నించింది. ఆకాలంలో తెలంగాణ గ్రామాల్లో రైతులు, కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలను సంఘటితం చేస్తోన్న సమయంలో ఆంధ్ర మహాసభ, తరువాత కమ్యూనిస్టు ఉద్యమం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను వెట్టిచాకిరి, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సమీకరించింది. ఐలమ్మ ఈ ఉద్యమంతో అనుబంధం ఏర్పరచుకుని తన పోరాటాన్ని మరింత విస్తరించి తన ఇంటిని కార్యాలయంగా మార్చి ఉద్యమం చేసిందన్నారు. తన కుటుంబాన్ని వేధించి అనేక ఇబ్బందులకు గురి చేసిన, మహిళలపై అఘాయిత్యాలు, దాడులు జరిపిన ఐలమ్మ వెనక్కి తగ్గలేదన్నారు. ఒక్క కుటుంబం కోసం ప్రారంభమైన పోరాటం అనేక మంది పేదల పోరాటానికి స్ఫూర్తిగా, ఒక మహిళా ధైర్యం తెలంగాణ ప్రాంత ప్రజలకు ఆత్మవిశ్వాసంగా మారిందన్నారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక పేరు కాదు, ఆమె ఒక చరిత్ర అన్నారు. బాంచన్ దొర నీకాలుమొక్తా అనే వివాదానికి చరమగీతం పాడింది ఐల్లమ్మ అన్నారు. విస్నూర్ దేశ్ముక్ లను, దొరలను, గడీల నుండి తరిమి కొట్టి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఐలమ్మ దన్నారు. వారి ఆశయాల బాటలో, ఇప్పుడున్న వ్యవస్థలో వెనుక పడిన బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని, దోపిడీ వ్యవస్థను ఎదిరించవల్సిన అవసరం ఉందన్నారు. ఐల్లమ్మ త్యాగం, పోరాటం తరతరాలుగా స్ఫూర్తి దాయకమన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రోజా, ం. నాగమణి, అంజలి, ఏ.నాగమణి, రుప్పని, శ్యామ్, బాలపీర్, పి.స్వామి, పి.భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.






## నీటి వనరులపై నిరంతర పర్యవేక్షణ

### -ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి ఆదేశం

నిజామాబాద్, సెప్టెంబర్ 10( ప్రజా కలం ప్రతినిధి ):

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న నీటి వనరులు వృథా కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీరాంసాగర్‌తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని అధికారులు వివరించారు. తాగునీటి అవసరాల కోసం నీటిని నిల్వ ఉంచడంతో పాటు, పంటలను కాపాడేందుకు రెండు తడుల వరకు సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నెల రోజుల పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. కాలువలు, తూముల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని తెలిపారు. నీటి వృథా కారణంగా పంటలు ఎండిపోతే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. ఖరీఫ్ పంటల సేకరణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గోదాముల్లోని బియ్యం నిల్వలను త్వరితగతిన తరలించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్, సెప్టెంబర్ 10( ప్రజా కలం ప్రతినిధి ): నగరంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం పరిశీలించారు. అదనపు కలెక్టర్



భుజంగరావుతో కలిసి గోడౌన్‌ను సందర్శించిన ఆయన.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్: హోరాహోరీగా వాలీబాల్, ఖోఖో పోటీలు

### - పడగల్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు క్రీడోత్సవాలు

### - బాలికల వాలీబాల్ విభాగంలో కుకునూరు జట్ల జయభేరి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 10:

మండల కేంద్రమైన వేల్పూరు పరిధిలోని పడగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహిస్తున్న 70వ ఎస్.జి.ఎఫ్ మండల అంతర పాఠశాలల క్రీడా పోటీలు రెండో రోజు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల బాలురు, బాలికలకు వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. జూనియర్ బాలికల విభాగంలో కుకునూర్, మోతే పాఠశాలల జట్ల మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను నిజామాబాద్ జిల్లా పీఈటీఏ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, ఆటల కన్వీనర్ పెంట జలంధర్, కుకునూరు హెచ్‌ఎం టి. హరిచరణ్, పచ్చల నడుకుల హెచ్‌ఎం రమేష్, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ పఠాని గంగాధర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. రెండో రోజు జరిగిన బాలికల వాలీబాల్ జూనియర్, సబ్ జూనియర్ రెండు విభాగాల్లోనూ కుకునూరు ఉన్నత పాఠశాల క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. విజయం సాధించిన క్రీడాకారిణులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు హరిత, చరణ్ దాస్, మల్కన్నా,జి. రవీందర్, గంగారెడ్డి, రాజేందర్, రాజేశ్వర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ సొమ్ముతో ఆస్తుల కొనుగోలు

### - రూ.3.02 కోట్ల అటాచ్‌మెంట్

### - రాజస్థాన్ నుంచి నిజామాబాద్‌కు ఆల్ప్రాజోలం సరఫరా నలుగురి అరెస్టు

**నిజామాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాకలం ప్రతినిధి):**

ఆల్ప్రాజోలం అక్రమ రవాణా, విక్రయాలతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన ముఠాపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్స్ వ్యాపారం ద్వారా సంపాదించినట్లు అనుమానిస్తున్న సుమారు రూ. 3.02 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాలతో రూరల్ పోలీసులు, ఈగల్ టీమ్ చేపట్టిన దర్యాప్తులో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి.




నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఐదుగురిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేయగా.. నలుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపి సాయి చైతన్య మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నలుగురి నుంచి 1.087 కిలోల ఆల్ప్రాజోలం, రెండు కార్లు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 3.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**రాజస్థాన్ నుంచి సరఫరా**

నిందితుల విచారణలో ఆల్ప్రాజోలం అక్రమ సరఫరా నెట్‌వర్క్ గుట్టు రట్టయిందని చెప్పారు. రాజస్థాన్ నుంచి మహారాష్ట్ర మీదుగా ఆల్ప్రాజోలం తీసుకొచ్చి నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కిలో ఆల్ప్రాజోలం రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

**అక్రమ సొమ్ముతో ఆస్తుల కొనుగోలు**

**భూములు.. స్థలాలు.. వాహనాలు**

డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ముతో నిందితులు భూములు, ఇంటి స్థలాలు, వాహనాలు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిజామాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని రిజిస్ట్రేషన్, రెవెన్యూ కార్యాలయాల నుంచి వివరాలు సేకరించారు. గుర్తించిన ఆస్తుల్లో 4.20 ఎకరాల వ్యవసాయ భూమి, 667 చదరపు గజాల ఖాళీ స్థలాలు, రెండు కార్లు, ద్విచక్ర వాహనం, బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ. 5 లక్షలు ఉన్నాయి. ప్రభుత్వ విలువ ప్రకారం వీటి మొత్తం విలువ రూ. 3.02 కోట్లుగా ఉన్నట్లు సిపి సాయి చైతన్య తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని 68ఎఫ్(2) కింద అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టామని,

**ఏడాదిగా దర్యాప్తు**

ఈ కేసులో సుమారు ఏడాది పాటు దర్యాప్తు కొనసాగిందని ఆయన వివరించారు. సుమారు పది మంది వ్యక్తుల మొబైల్ ఫోన్ సమాచారాన్ని విశ్లేషించి కీలక ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణాతో పాటు వాటి ద్వారా సంపాదించిన ఆస్తులపైనా దర్యాప్తు కొనసాగుతుందని సీపీ పి.సాయి చైతన్య వెల్లడించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ అక్రమ రవాణా లేదా విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా 112కు సమాచారం ఇవ్వాలని సీపీ సూచించారు.

# కుంభమేళ తరహాలో పుష్కరాలకు ఏర్పాట్లు

### - కందకుర్తి, యంచ ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### - సకాలంలో పనులు పూర్తి చేయాలి -ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, సెప్టెంబర్ 10(ప్రజా కలం ప్రతినిధి):**

వచ్చే ఏడాది జూన్, జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచ పుష్కర ఘాట్ల వద్ద గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి సుదర్శన్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కందకుర్తిలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 6.05 కోట్లతో ఘాట్ నిర్మాణం, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 3.90 కోట్లతో రోడ్లు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.





యంచలో రూ. 2.15 కోట్లతో ఘాట్, రూ. 70 లక్షలతో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. కందకుర్తిలో అన్ని శాఖల పనులకు కలిపి సుమారు రూ. 30 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేరాల కట్టడికి కఠిన చర్యలు

### - పండుగల వేళ పటిష్ఠ బందోబస్తు.. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా

### - రోడ్డు ప్రమాదాల నివారణకు 'బ్లాక్‌స్పాట్ల' గుర్తింపు.. పాత నేరస్థులపై నిఘా



నిజామాబాద్, సెప్టెంబరు 10 (ప్రజాకలం ప్రతినిధి):

బోధన్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పోలీసు అధికారులను ఆదేశించారు. బోధన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఏసీపీ, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దాడులు కొనసాగించాలని కమిషనర్ సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేకాట, గుట్కా, ఇసుక తదితర అక్రమ వ్యాపారాలపైనా నిరంతర దాడులు నిర్వహించాలన్నారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తం :** సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు పోలీసులు తక్షణమే స్పందించి సహాయం అందించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య, రెచ్చగొట్టే ప్రచారాలను అడ్డుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**పాత నేరస్థులపై నిఘా :** హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి, పేకాట తదితర కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై ఉన్న నిందితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి అనుమానిత వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాలన్నారు.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. షీటీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. హైవేలకు అనుసంధానమయ్యే లింకు రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సూచించారు. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలుంటే జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని సరిదిద్దాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రిబుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

**24 గంటల తనిఖీలు:** రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తును పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వాహనాల తనిఖీలను 24 గంటలూ కొనసాగించాలని, తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అత్యవసర సేవల కోసం డయల్-112పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర నియంత్రణకు సమర్థంగా వినియోగించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్.అంజయ్యతో పాటు సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బౌరంపేట దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు-ఎంపీ ఈటెల రాజేందర్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బౌరంపేట్ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండి మైసమ్మ మండలం లోని బౌరంపేటను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక దళితులు సర్వే నెంబర్ 472 ఎర్రమన్ను బొందల స్థలాన్ని సందర్శించారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బౌరంపేట దళితులను ఉద్దేశించి ప్రసంగించారు. బౌరంపేట్ మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అధ్యక్షతన ఈసమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దశాబ్దాలుగా వ్యవసాయం జీవనాధారంగా చేసుకొని జీవించిన దళితులకు ప్రభుత్వం ఏ పరిహారం ఇవ్వకుండానే అసైన్మెంట్ స్థలాలను వాపస్ తీసుకోవడం ధర్మం కాదన్నారు. దుండిగల్ లో అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఎకరాకు అసైనీకు 700 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకుందన్నారు. అలాగే బౌరంపేట్ లో సర్వే నెంబర్ 472లో ఇదే విధానాన్ని పాటించి ప్రతి ఎకరా నుండి అసైనీదారులకు 1000 గజాల స్థలాన్ని అన్ని హక్కులతో అసైన్ మెంట్ దారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బౌరంపేట దళితులకు ప్రభుత్వం నుండి పరిహారంగా భూమి పొందే వరకు ఎవరు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపవద్దని న్యాయంగా వారికి అందాల్సిన నష్టపరిహారం ఇప్పించేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

సభకు అధ్యక్షత వహించిన బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ మాట్లాడుతూ... ఇంతవరకు సర్వేనెంబర్ 472లో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొచ్చిన వారు నేడు ప్రభుత్వం వ్యవసాయం చేయకుండా ఆపడంతో ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం చేయవద్దని, దుండిగల్ అసైనీదారులకు ఏమాదిరిగా పరిహారం ఇస్తున్నారో అదే మాదిరిగా ప్రతి ఎకరాకు వెయ్యి గజాలు స్థలాన్ని దళితులకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు



నల్ల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగారెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 166కు చెందిన అసైని దారులు కూడా హాజరై తమకు ఎలాంటి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని ఈటెల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 166లో మొత్తం 450 ఎకరాలు స్థలం ఉండగా అందులో పోలీస్ డిపార్ట్మెంట్ కు 50 ఎకరాలు, స్మశాన వాటికకు 10 ఎకరాలు, డంపింగ్ యార్డ్ కు 10 ఎకరాలు, డబల్ బెడ్రూమ్స్ ఇళ్లకు 10 ఎకరాలు కేటాయించినట్లు వారు ఎంపీ ఈటెల రాజేందర్ కు వివరించారు. సుమారు 140 ఎకరాలు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న రైతుల అదుపులో భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో సర్వే నెంబర్ 166 అసైన్మెంట్ దారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేద్దామని మల్కాజ్గిరి ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి బౌరంపేట దళితులు వందలాదిగా హాజరయ్యారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఈసమావేశానికి రానున్నారని ప్రచారం జరిగిన ఆయన ఈసమావేశానికి రాలేదు. ఈసమావేశంలో బౌరంపేట దళిత నేతలు డప్పు కృష్ణ, బాలాగారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బలగారి మల్లేష్, చింతకింది రాము లమ్మ, అగ్గి నరసింహ, స్థానికులు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం చేయాలి

## గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉషారాణి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉషారాణి రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

గాంధీ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఉషారాణిని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గాంధీ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కార్మికులకు ఏ కష్టం వచ్చినా ముందుంటాను- బండి శ్రీరాములుగౌడ్

మేడిపల్లి సెప్టెంబర్ 10(ప్రజాకలం న్యూస్)



ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్. ఉప్పల్ బస్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా నియమితులైన బండి శ్రీరాములు గౌడ్ యూనియన్ సభ్యుల ఆహ్వానం మేరకు బుధవారం ఉప్పల్ బస్ డిపో కు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీరాములు మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు కార్మికులకు ఏ కష్టం వచ్చినా ముందుఉండి సమస్యలు పరిష్కరిస్తానని, డిపో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అందరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు,డిపో నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫోర్త్ సిటీ భూకేటాయింపులపై బీఆర్ఎస్ ధర్నా

- ప్రభుత్వ భూమిని దోచుకుంటున్నా సీఎం తమ్ముడు కొండల్ రెడ్డి
- ఫోర్త్ సిటీ భూముల కేటాయింపుపై ప్రభుత్వంపై ఫైర్ - తుక్కుగూడ ఉద్రిక్తతగా మారిన వైనం
- తుక్కుగూడ టెస్సెరాక్ట్ వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా నిర్వహించిన

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ - మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి








మహేశ్వరం , సెప్టెంబర్ 10,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో గురువారం రాజకీయ వేడి నెలకొంది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని టెస్సెరాక్ట్ సంస్థ వద్ద బీఆర్ఎస్ పార్టీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ధర్నాకు దిగడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**అసలేం జరిగింది?**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫోర్త్ సిటీ ప్రాజెక్టు పరిధిలో టెస్సెరాక్ట్ అనే ప్రైవేట్ కంపెనీకి వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను ఎలాంటి టెండర్లు, పారదర్శక విధానం లేకుండా కట్టబెట్టారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ టెస్సెరాక్ట్ కంపెనీ వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి ఉన్నారని, కుటుంబ సభ్యుల ప్రయోజనం కోసమే ప్రభుత్వ భూములను అడ్డగోలుగా దోచిపెడుతున్నారని వారు విమర్శించారు.

**కేటీఆర్ ఫైర్**

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "తెలంగాణ ప్రజల సొమ్ము, ప్రభుత్వ భూములు అంటే రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తి అనుకుంటున్నారా? ఫోర్త్ సిటీ అంటే ఫ్యామిలీ సిటీగా మార్చేశారు. టెస్సెరాక్ట్ కంపెనీకి ఏ అర్హత ఉంది? ఏ హోదాలో భూములు ఇచ్చారు? ఎన్ని ఎకరాలు ఇచ్చారు? ఎకరం ఎంతకు ఇచ్చారు? నిబంధనలు ఏమైనా పాటించారా? ఒక్క ప్రశ్నకైనా ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి భూముల దందా, రియల్ ఎస్టేట్ దందా తప్ప అభివృద్ధి లేదు. మేము ఈ దోపిడీని చూస్తూ ఊరుకోము. అసెంబ్లీలో, ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం" అని హెచ్చరించారు.

**హరీశ్ రావు డిమాండ్:**

మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, "ఫోర్త్ సిటీ పేరుతో రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాల భూములను సేకరించి కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. టెస్సెరాక్ట్ వ్యవహారంలో సీఎం సోదరుడి ప్రమేయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.

**ప్రాంతం పరిశీలన, పోలీసుల మోహరింపు:**

ధర్నా అనంతరం కేటీఆర్, హరీశ్ రావు బృందం టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూములను, నిర్మాణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడారు. ముందస్తు సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో కొద్దిసేపు తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**బీఆర్ఎస్ డిమాండ్లు:**

1. టెస్సెరాక్ట్ కంపెనీకి భూములు కేటాయించిన జీవోను వెంటనే బహిర్గతం చేయాలి.
2. ఎకరం ధర ఎంత? మొత్తం ఎన్ని వందల కోట్లు విలువ చేసే భూమి ఇచ్చారు? ప్రజలకు లెక్క చెప్పాలి.
3. ఈ కేటాయింపులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.
4. ఫోర్త్ సిటీ భూసేకరణలో రైతులకు అన్యాయం చేయొద్దు.ప్రభుత్వం సమాధానం చెప్పే వరకు ఈ పోరాటం ఆగదని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి), ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల నాయకులు, జిల్లా పార్టీ కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు.

# శ్వాసకోశ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

## సీజనల్ ఇన్ఫెక్షన్లతో ఆస్తమా, సీవోపీడీ తీవ్రతరమయ్యే అవకాశం కామినేని హాస్పిటల్స్ వైద్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : మాన్‌సూన్ సమయం లో అధిక తేమ, ఇళ్లలో తడిగా ఉండే వాతావరణం, శ్వా సకోశ ఇన్ఫెక్షన్లు, అలర్జీ కారకాలకు ఎక్కువగా గురికావడం వల్ల సాధారణంగా కనిపించే దగ్గు, జలుబు లేదా వైరల్ ఇన్ఫెక్షన్ కొన్నిసార్లు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని కామినేని హాస్పిటల్స్ పల్మనాలజీ వైద్యులు హెచ్చరించారు. ముఖ్యంగా ఆస్తమా, సీవోపీడీ తీవ్రతరమవడం, బ్రాంకైటిస్, వైరల్ ఇన్ఫెక్షన్ తర్వాత తగ్గని దగ్గు, అలర్జీ సంబంధిత శ్వాసకోశ సమస్యలు, న్యూమోనియా వంటి వాటిపై వైద్యపరంగా ఆందోళనలు పెరుగుతున్నాయని, అధిక ప్రమాదం ఉన్న వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కామినేని హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుభాకర్ కంది మాట్లాడుతూ మాన్‌సూన్ పరిస్థి తులు ఆస్తమా, సీవీపీడీ వంటి ఇప్పటికే ఉ న్న శ్వాసనాళ సంబంధిత వ్యాధులను మరింత తీవ్రతరం చేయవచ్చన్నారు. ప్రారంభ దశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా నియంత్రించగలిగే సమస్య తీవ్రమైన శ్వాసకోశ సమస్యగా మారకుండా నివారించవచ్చునని తెలిపారు. సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఈ. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వైరల్ ఇన్ఫెక్షన్ తర్వాత కొనసాగుతున్న దగ్గును ఎప్పుడూ సాధారణ బ్రాంకైటిస్ గా భావించకూడదన్నారు. స్పష్టమైన వైద్య అవసరం లేనప్పుడు అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడకూడదు అని చెప్పారు. మరో సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. శ్వాసకోశ సమస్యలకు సంబంధించిన ప్రమాద సంకేతాలను గుర్తించడం, అధిక ప్రమాదంలో ఉన్నవారిని కాపాడుకోవడం చాలా ముఖ్యమ న్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, ఆస్తమా, సీవీపీడీ, గుండె సంబంధిత వ్యాధులు లేదా ఇత ర దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నవారు మాన్‌సూన్ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే వైద్య సహాయం పొందాలి అని సూచించారు. కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ డీఎస్ సౌజన్య మాట్లాడుతూ వైద్యులు సూచించిన ఇన్‌హేలర్లు, మందులను సూచించిన విధంగానే కొనసాగించాలి. సకాలంలో వైద్యులను సంప్రదించ డం ద్వారా సమస్య తీవ్రతరం కావడాన్ని మొదట్లోనే గుర్తించి, మరింత క్షీణించకుండా నివారించవచ్చునన్నారు. కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ భరత్ జానపాటి వైద్య పరీక్షల ద్వారా శ్వాసకోశ లక్షణాలు ఇన్ఫెక్షన్, శ్వాసనాళ సంబంధిత వ్యాధి లేదా ఇతర శ్వాస కోశ సమస్య వల్ల కలుగుతున్నాయా అనేది గుర్తించి, చికిత్స అందించవచ్చునన్నారు.




# ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి : కేటీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన
- మహేశ్వరం సీనియర్ నేత వీరా నాయక్

మహేశ్వరం, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ):

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం తుక్కుగూడ ఫ్యాబ్ సిటీకి విచ్చేసిన కేటీఆర్ ను మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరా నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల కోసం ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిత్యం పోరాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను, వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు అండగా నిలబడి, ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేయాలని ఈ సందర్భంగా వీరా నాయక్ కు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం

## సాధ్యమైనంత మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు

### బ్రహ్మోస్ క్షిపణి పరిశ్రమ భూసేకరణపై రైతులతో కలెక్టర్ ఖుష్బూ గుప్తా చర్చలు




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 10:

బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ ఏర్పాటుతో మహబూబ్‌నగర్ జిల్లాలో పారిశ్రామికంగా, ఆర్థికంగా గణనీయమైన అభివృద్ధికి అవకాశాలు ఏర్పడనున్న నేపథ్యంలో, ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయే రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ భూసేకరణ ప్రక్రియను చేపడతామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, చట్టపరమైన నిబంధనల మేరకు సాధ్యమైనంత మెరుగైన పరిహారం అందించే అంశాన్ని పరిశీలిస్తామని ఆమె స్పష్టం చేశారు.
దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో బ్రహ్మోస్ ప్రాజెక్టు ఏర్పాటుకు చేపట్టనున్న భూసేకరణకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నెగోసియేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా రైతులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులతో చర్చించారు. భూసేకరణ పరిహారం, భూముల ప్రస్తుత మార్కెట్ విలువ, భూములు కోల్పోయే రైతుల జీవనోపాధి, భవిష్యత్ ప్రయోజనాలు తదితర అంశాలపై రైతుల అభిప్రాయాలను ఆమె స్వయంగా తెలుసుకున్నారు.
"మీ భూములకు ఎంత పరిహారం ఆశిస్తున్నారు? భూసేకరణకు సంబంధించి మీ అభిప్రాయాలు, అభ్యంతరాలను స్పష్టంగా తెలియజేయండి" అని కలెక్టర్ రైతులను కోరారు. రైతులు తమ భూములకు ప్రస్తుత మార్కెట్ విలువను దృష్టిలో ఉంచుకుని మెరుగైన పరిహారం అందించాలని కోరారు. భూమికి బదులుగా భూమి కేటాయించడంతో పాటు తగిన పరిహారం అందించాలని, భూములు కోల్పోయిన అనంతరం జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి**

బస్వాయిపల్లి గ్రామ సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక పరిశ్రమ రావడం గర్వకారణమన్నారు. అయితే గ్రామంలో అధిక శాతం ఒకటి నుంచి మూడు ఎకరాల వరకు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని తెలిపారు. వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులు భూములు కోల్పోతే వారి జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల భూమికి బదులుగా భూమి కేటాయించడంతో పాటు అదనపు పరిహారం అందించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. గ్రామ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్రహ్మోస్ ప్రాజెక్టు జిల్లాకు రావడం పట్ల గ్రామస్తులు సంతోషంగా ఉన్నప్పటికీ, తమ భూములను కోల్పోతున్న రైతుల విషయంలో ఆందోళన ఉందన్నారు. రైతుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత మార్కెట్ విలువ కంటే మెరుగైన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**రైతుల ప్రయోజనాలు–ప్రాజెక్టు అభివృద్ధి సమతుల్యంగా ఉండాలి**

కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు జిల్లాకు రావడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధితో పాటు ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.
ప్రాజెక్టు ద్వారా జిల్లాకు కలిగే అభివృద్ధి అవకాశాలను, అదే సమయంలో భూములు కోల్పోయే రైతుల ప్రయోజనాలను సమతుల్యం చేస్తూ భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సాధ్యమైనంత మెరుగైన పరిహారం అందించే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.
భూసేకరణ చట్టంలోని నిబంధనలు, రిజిస్ట్రేషన్ విలువలు, భూముల మార్కెట్ విలువలు, పరస్పర సమ్మతి (కన్సెంట్) ఆధారంగా లభించే పరిహారం తదితర అంశాలను రైతులకు కలెక్టర్ వివరించారు. సాధారణ అవార్డు ద్వారా లభించే పరిహారంతో పోలిస్తే, రైతులు పరస్పర సమ్మతితో ముందుకు వస్తే నిబంధనల మేరకు మెరుగైన పరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.
ఇది ప్రాథమిక దశ చర్చ మాత్రమేనని, ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న డేటా, చట్టపరమైన నిబంధనలు, రిజిస్ట్రేషన్ విలువలు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి వివరాలను రైతులకు తెలియజేస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులు కూడా గ్రామస్థాయిలో సమావేశమై పరస్పరం చర్చించుకుని తమ అభిప్రాయాలను, ఆచరణాత్మక ప్రతిపాదనలను అధికారులకు తెలియజేయాలని సూచించారు.

**భూసేకరణ సర్వే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి**

భూసేకరణకు సంబంధించి చేపట్టిన సర్వేలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, పట్టా భూములు, కబ్జా వివరాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే వివరాలపై రైతులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.
రైతులు, ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో మరోసారి సమావేశమై వాస్తవ పరిస్థితులు, భూముల ప్రస్తుత ధరలు, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆచరణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. బ్రహ్మోస్ ప్రాజెక్టు అభివృద్ధి, రైతుల ప్రయోజనాలు రెండింటినీ సమన్వయం చేస్తూ భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయబద్ధంగా పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్.డీ.ఓ. నవీన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, గ్రామ సర్పంచులు, రైతులు, గ్రామస్తులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పుష్కరాల పనులన్నీ శాఖల సమన్వయంతో చేపట్టాలి

– గడువులోగా పనులు పూర్తి చేయాలి: – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

– బాసరలో పుష్కరాల పనులపై జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్



నిర్మల్ సెప్టెంబర్10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

గోదావరి పుష్కరాల పనులన్నీ శాఖల మధ్య సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి బాసర ఈవో కార్యాలయంలో గోదావరి పుష్కరాల పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసరలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు, వీఐపీ, వీవీఐపీ భక్తులకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాల నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణ, సంఖ్య లెక్కింపు అంశాల్లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలన్నారు. చేపట్టే పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని స్పష్టం చేశారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. భక్తుల రద్దీ మేరకు తగినన్ని ఆర్టీసీ బస్సులు నడపాలని వివరించారు. పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తగినన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, త్రాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు తగిన భద్రత కల్పిస్తామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంతో ఉండి, భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కేంద్రీకృత విధానం ద్వారా నిఘా ఉంచుతామని అన్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. తగినంత మంది పోలీసు సిబ్బందిని పుష్కరాలకు కేటాయిస్తామని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, సందీప్, శంకరయ్య, అనిల్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట

# అసలైన వారసులు కమ్యూనిస్టులే

– వీర నారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దాం



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 10 ప్రజా కలం (ప్రతినిధి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని, వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగించాలని సీపీఎం మండల నాయకుడు పి. శివశంకర్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలం జనుంపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పి. శివశంకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిందన్నారు. విసునూరు రామచంద్రారెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా సాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల్లో అపారమైన స్ఫూర్తిని నింపిందన్నారు. తనకున్న నాలుగు ఎకరాల భూమిలో పంట సాగు చేసుకున్న ఐలమ్మ పంటను స్వాధీనం చేసుకునేందుకు విసునూరు రామచంద్రారెడ్డి అనుచరులు ప్రయత్నించగా, ఆంధ్ర మహాసభ నాయకత్వంలో వారిని ప్రతిఘటించి తన భూమిని, పంటను కాపాడుకున్న గొప్ప పోరాట యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటం కారణంగానే లక్షలాది ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేయబడిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పేదలకు భూమి పంపిణీ చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామ్య చైతన్యం పెరగడం ఆ పోరాట ఫలితమేనని అన్నారు. నేటికీ భూమిలేని పేదలకు భూములు పంపిణీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నిజాం నిరంకుశ పాలనలో జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు ప్రజలపై అనేక రకాల దౌర్జన్యాలకు పాల్పడ్డారని తెలిపారు. వారి అరాచకాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పుచ్చపల్లి సుందరయ్య నాయకత్వంలో రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి భీమ్ రెడ్డి నరసింహారెడ్డి అమరుడు దొడ్డి కొమరయ్య వీరనారి చాకలి ఐలమ్మ కాచం కృష్ణమూర్తి షేక్ బందాగి ముగ్ధం మొహినుద్దీన్ సోయబుల్లా ఖాన్ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు మహేందర్ రైతులు దుడుమయ్య నరసింహ నాగేంద్రం యువకులు శివాన్స్ మహేష్ చంటి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# పాఠశాలల్లో నాణ్యమైన విద్య పౌష్టికాహారం అందించాలి

– భూ రీ సర్వే పనులను రికార్డులతో సరిపోల్చి పకడ్బందీగా పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 10 ప్రజాకాలం (ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం పాఠశాలలను పర్యటించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని కూడా పరిశీలించారు. పాఠశాల తనిఖీ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల హాజరు, విద్యాబోధన విధానం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామం లో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను జిల్లా పరిశీలించారు. భూముల హద్దులు, ప్రభుత్వ భూములు, నిరుపయోగ భూములు, వ్యవసాయ భూములు, పట్టా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వేలో నమోదు చేస్తున్న వివరాలను రెవెన్యూ రికార్డులతో పూర్తిస్థాయిలో సరిపోల్చాలని సూచించారు. భూముల వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా, ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్ తహసిల్దార్ ఎండి జమీల్ ఎంపీడీవో విజయలక్ష్మి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన పాలమూరు బిడ్డ

– భరత్ చంద్రకు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా రూ.2,52,250 ఆర్థిక సహాయం



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 10:

పరాగ్వే దేశం అసున్సియోన్‌లో అక్టోబర్ 2 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు భారత జట్టుకు ఎంపికైన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కోడుగంటి భరత్ చంద్రకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రూ. 2,52,250 ఆర్థిక సహాయం అందించారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసిన భారత జట్టులో తెలంగాణ రాష్ట్రం నుంచి భరత్ చంద్రకు చోటు లభించింది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత తనకు లేదని, సహాయం అందించాలని భరత్ చంద్ర కలెక్టర్‌ను అభ్యర్థించారు. భరత్ చంద్ర పరాగ్వే వెళ్లి ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ. 5,05,000 ఖర్చవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ జిల్లా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి మొత్తం ఖర్చులు 50 శాతం ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో భరత్ చంద్రకు రూ. 2,52,250 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. భరత్ చంద్ర ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి, మహబూబ్‌నగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో, డి.ఆర్.ఓ ఏ. నిర్మల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుఃఖంలో తోడుగా.. బాధిత కుటుంబానికి అండగా బిర్రు రాజు

– మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేత

– కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా



వర్ధన్నపేట, సెప్టెంబర్ 10 (ప్రజాకలం): వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బిర్రు ఎల్లయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందడం తీవ్ర విషాదకరమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బిర్రు రాజు అన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులను గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు శ్రీమతి బిర్రు సరోజన, బిర్రు ఎల్లేష్, బిర్రు రాజును పరామర్శించిన బిర్రు రాజు.. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో 50 కిలోల బియ్యం బ్యాగ్‌ను అందజేశారు. కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట సమయంలో అండగా నిలవడం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, వార్డు సభ్యుడు ఆరెల్లి నాగరాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బిర్రు మామునూరు పెద్ద యాకయ్య, బిర్రు గోపాల్, దుగ్యాల దేవేందర్‌రావు, బిర్రు సురేందర్, తాటికాయల సాయి ప్రవీణ్, బిర్రు భాస్కర్, జనపరెడ్డి సంపత్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.కావాలంటే ఇదే వార్తను ఇంకాస్త ఘాటైన ఆంధ్రజ్యోతి ఫ్రంట్‌పేజ్ శైలిలో లేదా చిన్న క్లిప్పింగ్ ఫార్మాట్‌లో కూడా తయారు చేస్తాను.

# చెన్నారంలో నక్ష రీసర్వేకు శ్రీకారం..!

అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ – భూ రికార్డుల ప్రక్షాళనకు కీలక అడుగు



సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపెట)

భూ రికార్డులను మరింత పకడ్బందీగా రూపొందించి, భూముల సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను కచ్చితంగా నమోదు చేసే లక్ష్యంతో చేపడుతున్న నక్ష రీసర్వే ప్రక్రియలో భాగంగా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులతో క్షేత్రస్థాయి వివరాలను సరిపోల్చే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడం ద్వారా భవిష్యత్‌లో భూ సరిహద్దులు, విస్తీర్ణం తదితర అంశాలపై తలెత్తే వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూ రికార్డులను మరింత పారదర్శకంగా, శాస్త్రీయంగా రూపొందించేందుకు రీసర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు.రీసర్వే ప్రక్రియలో భాగంగా వర్ధన్నపేట తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొని క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులను సమన్వయం చేశారు. గ్రామంలో రీసర్వేకు సంబంధించిన ప్రక్రియను అధికారులు పరిశీలిస్తూ, అవసరమైన సూచనలు చేశారు.

**రైతులకు ప్రయోజనం...** నక్ష రీసర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రికార్డులను నవీకరించడంతో పాటు, భవిష్యత్‌లో భూ లావాదేవీలు, వారసత్వ బదలాయింపులు, సరిహద్దుల నిర్ధారణ వంటి అంశాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు, భూ యజమానులకు భూ రికార్డుల విషయంలో మరింత భరోసా కలగనుంది.రీసర్వే ప్రక్రియను అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించినట్లు సమాచారం.చెన్నారం గ్రామం లో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా పనుల పురోగతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లయింది.

# కత్తితో దాడి.. యువకుడి దారుణ హత్య

## – ఏకాంతంగా ఉన్న జంటలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా

## – హత్య, హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్.. కత్తి, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం




సెప్టెంబర్ 9 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ )

నిర్మానుష్య ప్రాంతాల్లో ఏకాంతంగా ఉన్న జంటలను బెదిరించి వీడియోలు తీసి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా.. చివరకు హత్యకు పాల్పడింది. గత కొంతకాలంగా బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురు యువకులు ఓ వర్గంతో జరిగిన ఘర్షణలో మేకల గౌతమ్ అనే యువకుడిని కత్తితో పొడిచి హత్య చేయడంతోపాటు మరో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి మామునూర్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

**జంటలను బెదిరించి వసూళ్లు...**పోలీసుల వివరాల ప్రకారం.. తిమ్మాపూర్, పరిసర ప్రాంతాలకు చెందిన సామల పవన్ (25), ఈద జానకిరామ్ (22), ముద్దేపాక మనోజ్ (21), ఎస్‌డీ హుస్సేన్ (24) కొంతకాలంగా ముఠాగా ఏర్పడ్డారు. భట్టుపల్లి, అమ్మవారిపేట శివారు ప్రాంతాల్లో బైక్‌లపై తిరుగుతూ ఏకాంతంగా ఉన్న జంటలను కత్తితో బెదిరించి వారి సెల్‌ఫోన్లలో వీడియోలు తీసేవారు.ఆ వీడియోలను సోషల్ మీడియాలోపెడతామని బెదిరిస్తూ డబ్బులువసూలు చేసేవారనిపోలీసులు తెలిపారు.

**వీడియో వ్యవహారంతో వివాదం....** ఆగస్టు 30న రాత్రి భట్టుపల్లి రోడ్డు వద్ద ఓ జంటను బెదిరించి వీడియో తీయడంతో వివాదం మొదలైంది. అనంతరం ఆ జంటకు సంబంధించిన మిత్రుడు రోహిత్‌ను ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిందితులు బెదిరిస్తూ డబ్బులు, బీర్ బాటిళ్లు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై రోహిత్, అతని బావమరిది మేకల గిరిధర్‌కు నిందితులతో ఫోన్‌లో పలుమార్లు తీవ్ర వాగ్వాదం జరిగింది.

**కత్తితో దాడి.. గౌతమ్ మృతి**

సెప్టెంబర్ 4 రాత్రి వివాదం ముదరడంతో నిందితులు ముందస్తు పథకంతో కత్తితో బైక్‌లపై బయలుదేరారు. హంస బేకరీ వద్ద, అనంతరం ఖమ్మం–వరంగల్ బైపాస్ రోడ్డులోని బేస్తం చెరువు వైపు వెళ్లే మట్టి రోడ్డు వద్ద ఇరువర్గాలు ఎదురుపడ్డాయి. అక్కడ జరిగిన ఘర్షణలో సామల పవన్ బైక్ నుంచి కత్తిని తీసుకుని మేకల గౌతమ్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రోహిత్‌పై కూడా దాడి చేయడంతో అతని కాలికి తీవ్ర గాయమైంది.అనంతరం నిందితులు కత్తి, బైక్‌లను చెట్ల పొదల్లో పడేసి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు**

సెప్టెంబర్ 9 ఉదయం ఆర్‌టీఓ జంక్షన్ వద్ద మామునూర్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు హత్య, హత్యాయత్నం కేసులో నిందితులుగా తేలడంతో అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో సామల పవన్ (25), ఈద జానకిరామ్ (22), ముద్దేపాక మనోజ్ (21), ఎస్‌డీ హుస్సేన్ ఉన్నారు. వీరిలో కొందరిపై గతంలోనూ వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

**కత్తి, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన రెండు మోటార్‌సైకిళ్లు, కత్తి, డిజిటల్ ఆధారాలు కలిగిన ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన మామునూర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్‌ఐలు ప్రవీణ్, నిస్సార్‌పాషా, హరిశంకర్, కానిస్టేబుళ్లు రవి, మంగిలాల్, మోహన్, రమ్య, ముజామీల్ ఆలీ, కరుణాకర్, శ్రీనివాస్, మురళి, సంపత్, రాజేందర్, భాను, ఏఎఓ సల్మాన్ పాషాలను ఏసీపీ మామునూర్, డీసీపీ ఈస్ట్‌జోన్ అంకిత్‌కుమార్ శాన్వార్ అభినందించారు.

# యూరియా యాప్‌తో రైతులకు నరకయాతన

## – షాపుల్లో బస్తాలు ఉన్నా.. రైతుల చేతికి మాత్రం అందని వైనం..

## – పాత యాప్‌లో సులభం.. కొత్త యాప్‌లో నానా ఇక్కట్లు..

## – పంట చేతికొచ్చే సమయంలో యూరియా కోసం రైతుల అవస్థలు

(వరంగల్/పర్వతగిరి)
సెప్టెంబర్ 10, ప్రజాకలం ప్రతినిధి:

వంటలకు యూరియా అవసరమైన కీలక సమయంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల రైతులకు కొత్త యాప్ కష్టాలు తప్పడం లేదు. గతంలో యాప్ ద్వారా సులభంగా యూరియా బస్తాలు పొందిన రైతులు.. ప్రస్తుతం కొత్త యాప్ విధానంతో గంటలు, రోజుల తరబడి ఫర్టిలైజర్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా బస్తాలు నిల్వ ఉన్నప్పటికీ, కొత్త యాప్‌లో నమోదులు, బుకింగ్ తదితర ప్రక్రియల కారణంగా తమకు అవసరమైన సమయంలో యూరియా అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఉన్నాయి.. యూరియా షాపులో ఉంది.. పంటకు అత్యవసరం.. అయినా మా చేతికి మాత్రం బస్తా రావడం లేదు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాత విధానం సులభం.. కొత్త విధానం భారమా?**

గతంలో ఉన్న యాప్ ద్వారా యూరియా పొందడం సులభంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్త యాప్ అమల్లోకి వచ్చిన తర్వాత సాంకేతిక సమస్యలు, నమోదు ప్రక్రియ, స్లాట్ తదితర అంశాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన తక్కువగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?..**

ఫర్టిలైజర్ షాపుల్లో ఎంత యూరియా స్టాక్ ఉంది? యాప్‌లో ఎంత చూపిస్తోంది? రోజుకు ఎంతమంది రైతులకు పంపిణీ చేస్తున్నారు? యాప్‌లో సాంకేతిక సమస్యలు ఎందుకు వస్తున్నాయి? అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. యాప్ రైతుల సౌకర్యం కోసం తీసుకొచ్చిందే తప్ప.. రైతులను యాప్ చుట్టూ తిప్పడానికి కాదని రైతులు మండిపడుతున్నారు. పంటకు యూరియా అత్యవసరమైన సమయంలో సాంకేతిక కారణాలతో రైతులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్‌ను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

**యూరియా కావాలి.. యాప్ కష్టాలు వద్దు**

పంటలకు సరైన సమయంలో ఎరువు అందకపోతే దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం డిజిటల్ విధానాలను తీసుకురావడం మంచిదే అయినప్పటికీ, అవి రైతులకు సౌకర్యంగా ఉండేలా ఉండాలని కోరుతున్నారు. పర్వతగిరి మండలంలో యూరియా పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రైతుల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# దళిత ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించం

## – స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

## – బీఆర్ఎస్ తీరుపై టీడీపీ వర్ధన్నపేట ఇన్‌చార్జి చాడ మరియా సురేఖ ఆగ్రహం

సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని తెలుగు దేశం పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియా సురేఖ డిమాండ్ చేశారు. స్పీకర్‌పై వ్యాఖ్యలను నిరసిస్తూ దళిత సంఘాలు కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన నేపథ్యంలో.. నిరసనకారులు వెళ్లిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేశారంటూ బీఆర్ఎస్ వర్గాల నుంచి వచ్చిన వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని ఆవె మండిపడ్డారు. 21వ శతాబ్దంలోనూ అస్పృశ్యత, వర్ణ వివక్షను ప్రతిబింబించేలా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపిన దళితులను అవమానించడం ద్వారా బీఆర్ఎస్ నాయకుల మనస్తత్వం బయటపడిందని విమర్శించారు. దళిత సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన తీరుపై ఆ పార్టీ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్ ఆదేశాలతోనేనా..?**

కేసీఆర్ ప్రత్యక్ష ఆదేశాలు లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంతటి తీవ్రమైన దళిత వ్యతిరేక చర్యకు పాల్పడటం సాధ్యమేనా అని సురేఖ ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలకు పాల్పడితే తెలంగాణ సమాజం తగిన రీతిలో స్పందిస్తుందని హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై అణచివేత, అహంకారానికి తావులేదని బీఆర్ఎస్ గుర్తుంచుకోవాలన్నారు. దళితుల ఆత్మగౌరవంపై దెబ్బకొడితే తిరగబడటం తమకు కొత్త కాదని సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన శాసనసభ స్పీకర్‌ను, న్యాయం కోసం నిరసన తెలిపిన దళితులను అవమానించిన బీఆర్ఎస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు, ముఖ్యంగా దళితులు తమ ఓటుతోనే సమాధానం చెబుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ బంగారం తాకట్టు పత్రాలతో మోసం

## – ఇద్దరు నిందితుల అరెస్ట్ ... సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కిషోర్




హనుమకొండ సెప్టెంబర్ 10 ప్రజా కలం ప్రతినిధి

నకిలీ బంగారం తాకట్టు పత్రాన్ని సృష్టించి,వాస్తవంగా బంగారం తాకట్టు లేకపోయినా ఉన్నట్లు నమ్మించి గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ. 59.30 లక్షలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.అరెస్టయిన వారిలో ఎలిమి సంతోష్ (37),శ్రీమాన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్ మరియు సీఈఓ,వడ్డేపల్లి రంజిత్ (39), వ్యాపారి ఉన్నారు.పోలీసుల విచారణలో,ఇద్దరూ కలిసి కుట్ర పన్ని రంజిత్‌కు చెందిన సుమారు 640 గ్రాముల బంగారం, శ్రీమాన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్‌లో తాకట్టు ఉన్నట్లు చూపిస్తూ నకిలీ ప్లెడ్జ్ రసీదు తయారు చేసినట్లు వెల్లడైంది.ఆ నకిలీ పత్రాన్ని నిజమైనదిగా నమ్మించిన నిందితులు,బంగారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి తన బ్యాంక్ నుంచి RTGS ద్వారా రూ.59,30,000/ను శ్రీమాన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ ఖాతాకు బదిలీ చేసినారని పోలీసులు తెలిపారు.అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గోల్డ్ కంపెనీ ప్రతినిధులు హెచ్చరించడంతో,ఖాతాలోని నగదును ఇతర అవసరాలకు మళ్లించినట్లు విచారణలో వెల్లడైంది.కేసు దర్యాప్తులో నిందితుల మొబైల్ ఫోన్‌లు మరియు pledge కాపీ ని స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అరెస్ట్ చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ మోసంలో మరెవరైనా ప్రమేయం ఉందా,ఇదే తరహాలో ఇతర గోల్డ్ ఫైనాన్స్ సంస్థలను మోసం చేశారా అనే కోణాల్లో కూడా విచారణ జరుగుతోందనీ హనుమకొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కిషోర్ మాట్లాడుతూ..గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు మరియు ప్రజలు నకిలీ తాకట్టు పత్రాలను నమ్మకుండా,తాకట్టు పెట్టిన బంగారం వాస్తవంగా ఉందా లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా ధృవీకరించుకున్న తర్వాతే ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని పోలీస్ లు సూచించారు.

# ఆపదలో ఆదుకున్న ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్

## – కుటుంబానికి 5,50,000 రూపాయల చెక్ అందజేత



మహబూబాబాద్, కురవి ,సెప్టెంబర్ 10,(ప్రజాకలం):

కురవి మండల కేంద్రం తాట్య తండ లో గుండెపోటుతో మృతి చెందిన కుటుంబానికి అండగా ఎస్బిఐ లైఫ్ మహబూబాబాద్ బ్రాంచ్ పరిధిలో ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని, సేవ నిబద్ధతను చాటుకుంది. పాలసీదారుల కష్టకాలంలో అండగా నిలుస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది.

వివరాల్లోకి వెళితే... శ్రీ బోడ ప్రసాద్ (తండ్రి: లక్ష్మా ) ఎస్బిఐ లైఫ్ పాలసీ ద్వారా 50,000/- ప్రీమియం చెల్లించారు. అయితే, దురదృష్టవశాత్తు పాలసీ తీసుకున్న సుమారు 4 నెలల తర్వాత, వారి తల్లి శ్రీమతి బోడ దేవి గారు గుండెపోటు (హార్ట్ ఎటాక్) కారణంగా మృతి చెందడం జరిగింది. ఈ క్లిష్ట సమయంలో ఎస్బిఐ లైఫ్ యాజమాన్యం తక్షణ స్పందించి, బాధితుడి కుటుంబానికి 5,50,000/- (ఐదు లక్షల యాభై వేల రూపాయలు) క్లెయిమ్ చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తటియ తండా గ్రామ సర్పంచ్ భూక్యా రమేష్ , మహబూబాబాద్ బ్రాంచ్ మేనేజర్ పొదిలి కృష్ణ, సీనియర్ ఏజెన్సీ మేనేజర్ నూనావత్ కిషన్ , లైఫ్ మిత్ర భూక్య జగదీశ్ , లైఫ్ మిత్ర కుమార్ భూక్య, రవి, బతుల రామకృష్ణ , సీనియర్ ఫైనాన్షియల్ అడ్వైజర్ జెట్టి యాకయ్య, తదితరులు పాల్గొని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

“బీమా అంటే కేవలం పాలసీ కాదు… కుటుంబ భవిష్యత్తుకు భరోసా.”

ఎస్బిఐ లైఫ్ – కష్టం వచ్చినప్పుడు కుటుంబానికి నిజమైన ఆర్థిక భరోసా.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు

## – కోరుట్లలో అలింకో ఆధ్వర్యంలో గుర్తింపు, నిర్ధారణ శిబిరం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి,సెప్టెంబర్ 10(ప్రజా కలం): ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు కోరుట్ల పట్టణంలోని మార్కండేయ వీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం గుర్తింపు, నిర్ధారణ శిబిరం నిర్వహించారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) సంయుక్త ఆధ్వర్యంలో ఎనిమిది మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్, మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అలింకో వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన సహాయ ఉపకరణాలకు అర్హతను నిర్ధారించారు. శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన పరికరాలు పొందడం ద్వారా విద్యార్థుల జీవన నైపుణ్యాలు మెరుగుపడి, మరింత సౌకర్యవంతమైన జీవనం సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నిర్ధారణ అనంతరం విద్యార్థులు రసీదులు తీసుకుని, భవిష్యత్తులో నిర్వహించే అలింకో పరికరాల పంపిణీ కార్యక్రమానికి వాటిని తీసుకురావాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి నరేషం మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కూడా సాధారణ జీవనం సాగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్, వివిధ మండలాల ఐఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు.



# చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగించాలి

## తెలంగాణ విమోచన పోరాటానికి ఆమె ఆదర్శం – మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాకలం)

తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని చింతకుంటలో ఆమె విగ్రహానికి రజక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ విమోచన పోరాటానికి ఆద్యురాలని పేర్కొన్నారు. భూస్వాముల అరాచకాలను ధైర్యంగా ఎదిరించిన ధీర వనితగా, రజాకార్లను ఎదురించి తెలంగాణ విముక్తి పోరాటానికి బాటలు వేసిన యోధురాలిగా ఆమె చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి కూడా చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హిందూ సమాజానికి రజకులు ఆడబిడ్డ లాంటి వారని, పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి ఒక్కరి జీవితంతో రజకుల జీవితం ముడిపడి ఉంటుందని అన్నారు. చాకలి ఐలమ్మ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జ్ఞానేశ్వర్, బబోరగళ్ల పోషాలు, పెద్దింటి లక్ష్మణ్, మతులాపురం బుజ్జి, మగ్రిపెల్లి లక్ష్మీనారాయణ, గుండరపు రాజేశ్, మగ్రిపెల్లి గంగాధర్, మతులాపురం శ్రీనివాస్, బోరగాళ్ల తిరుపతి, గుండరపు శ్రీనివాస్, కళ్లేపల్లి దుర్గయ్య, మతులాపురం శంకర్, నీలం పెద్దులు, వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ పరిశీలన

## – అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి,సెప్టెంబర్ 10(ప్రజాకలం): కోరుట్ల పట్టణంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పుల సవరణ, జారీ చేసిన నోటీసులు, పెండింగ్ నోటీసులు, పూర్తయిన సవరణల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఇంటిపేరు, పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

అర్హత కలిగిన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేరు, ఇంటిపేరులో మార్పులు అవసరమైతే సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేపట్టాలని తెలిపారు. ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేసిన నోటీసుల అనంతరం ఓటర్లకు నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, ప్రజల స్పందన ఎలా ఉందనే వివరాలను తెలుసుకున్నారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

**పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా ప్రారంభించాలి**

అనంతరం కోరుట్లలో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయిన నేపథ్యంలో ప్రారంభానికి అవసరమైన పనులను వేగవంతం చేసి, భవనాన్ని త్వరగా ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుజాత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## అమరవాయి స్టేజ్ వద్ద ప్రమాదాల నివారణకు
# స్పీడ్ బ్రేకర్‌కు రేడియం రంగులు



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజా కలం: మల్దకల్ మండలం అమరవాయి గ్రామ స్టేజ్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం బ్లూ కోల్ట్స్ సిబ్బంది వీసీలు సుధాకర్, భీమరాయుడు కలిసి స్పీడ్ బ్రేకర్‌కు పసుపు రంగుతో పాటు రేడియం రంగులు వేశారు. రాత్రి వేళల్లో వాహనదారులకు స్పీడ్ బ్రేకర్ స్పష్టంగా కనిపించేలా ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు వేగాన్ని నియంత్రించి జాగ్రత్తగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

## – బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజా కలం:
ధరూరు మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. నైజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన ఆమె ధైర్యం, తెగువ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బహుజన పోరాట పటిమకు చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ, ఆమె స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని బాసు హనుమంతు నాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజా కలం: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు వెళ్తున్నారన్న సమాచారంతో మల్దకల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ నాయకులు వీరేష్ గౌడ్, పుణ్యమూర్తులను మల్దకల్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీరేష్ గౌడ్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ పార్టీ నాయకులను అణిచివేయడం సరికాదన్నారు. అరెస్టులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

## – మరిపెడ మున్సిపాలిటీ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి



మరిపెడ ప్రతినిధి ప్రజాకలం న్యూస్ సెప్టెంబర్ 10 మరిపెడ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎస్ జి ఎఫ్ జోనల్ లెవల్ సెలక్షన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర స్థాయిలో రాణించి మరిపెడ పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునిత రవీందర్ రెడ్డి,మండల విద్యాశాఖ అధికారి అనితా దేవీ,మున్సిపల్ కమిషనర్ కంచర్ల నరేష్ రెడ్డి,కౌన్సిలర్లు పానుగోతు రాములు,జాటోత్ సురేష్,మెరుగు రాము,తిరుపతి,బోడ భాస్కర్,కో ఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న,షేక్ అజీజ్,వ్యాయామ ఉపాధ్యాయులు అనంతగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి మినీ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాకలం) త్వరలో మెట్‌పల్లి మినీ స్టేడియంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు, మండల స్థాయి, పాఠశాల క్రీడోత్సవాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ అధికారులు సురేష్, ముజీబ్‌లతో కలిసి మినీ స్టేడియాన్ని పరిశీలించారు. క్రీడా పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు కూర్చునేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని కోరారు. లాంగ్‌జంప్, హైజంప్ ప్రాంతాలను ఇసుకతో సరిచేయాలని, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌కు అనువుగా మైదానాన్ని బ్లేడ్‌తో చదును చేయాలని సూచించారు. అలాగే రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు స్టేడియంలోకి ప్రవేశించి ప్రహరీ భవనాన్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. స్టేడియం భద్రత కోసం శాశ్వత వాచ్‌మన్‌ను నియమించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాందాసు కోరారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, కౌన్సిలర్లు బత్తుల నరేష్, మాసుల ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదన్న మద్దుల

## – కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేయడంపై భగ్గుమన్న కాంగ్రెస్
## – ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



ఎండపల్లి, సెప్టెంబర్ 10 : ( ప్రజా కలం ప్రతినిధి ) దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో వారిని అవమానించే విధంగా కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజారాంపల్లి గ్రామం లోని వివేకానంద విగ్రహం కూడలి వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారాస నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ లో ఒక దళితుడిని అధ్యక్ష అని పిలవడం ఇష్టం లేక ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ కి రావడం లేదు అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సాటి దళితులను భారాస నాయకులు చేస్తున్న అరాచకాలకు ఈశ్వర్ కూడా ఖండించక పోవడం వల్ల దళితులకు తీరని అన్యాయంశీ చేస్తున్నారని, దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియ జేయడానికి వెళితే వారిని అవమానించేలా ఫామ్ హౌస్‌ను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా కాంగ్రెస్ నాయ కులు అభివర్ణించారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే చూస్తూ ఊరుకోం. ప్రజాస్వామ్యం లో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరు అని కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. భారాస నాయకుల తీరును తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దళితులు, పేదలు, అణగారిన వర్గాల గౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్ర శేఖర్ యాదవ్,మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, ఎండపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంగ రమేష్ యాదవ్, పలు గ్రామాల సర్పంచులు గొల్లపల్లి మల్లేశం గౌడు, బాలసాని శారద–మల్లేశం గౌడ్, కోడిపెల్లి కొమురమ్మ–శ్రీనివాస్, పడిదం లావణ్య–మొగిలి, బెద్దల ప్రవీణ్, కొంగల జగదీశ్వర్ రెడ్డి, దర్శనాల నరేష్, సింగిరెడ్డి లింగారెడ్డి, పలు గ్రామశాఖ అధ్యక్షులు, ఏ ఎంసీ డైరెక్టర్లు, పోలోజు శ్రీనివాస్, గాజుల విజయ్, వెంకటస్వామి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, లచ్చయ్య, రవీందర్, నారాయణ, సుధాకర్, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌లో కోకో సాగుతో అదనపు ఆదాయం

మల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి): మల్లాపూర్ రెడ్డి సంఘ భవనంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి కె. లత మాట్లాడుతూ కోకో సాగుకు ఎకరానికి మొదటి సంవత్సరం రూ.4,800, రెండో సంవత్సరం రూ.2,400 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల వయసున్న, నీటి వసతి ఉన్న ఆరోగ్యకరమైన ఆయిల్‌పామ్ తోటల్లో కోకో సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని మండెలీజ్ ఇంటర్నేషనల్ కంపెనీ సీనియర్ సాంకేతిక అధికారి మనోజ్ రెడ్డి సూచించారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, ఫొటోతో ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.




కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య అధికారి సుజాత ఆకస్మిక సందర్శన...



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 10 ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గ్రామ గోదావరి నది ని జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.సుజాత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోదావరి వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ ను సందర్శించి,ఆరోగ్య సేవలు, ఒపీ రిజిస్టర్లు, రికార్డులు,మందుల లభ్యత సిబ్బంది పనితీరును పరిశీలించారు.ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై పరిశీలన చేశారు. డీపీవో రవీందర్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రూపేష్, ఏఎన్ఎం,ఆశ లు తదితరులు పాల్గొన్నారు.

# రాజేశ్వరరావుపేట శ్మశాన వాటికకు కల్వర్టు

## – రూ.26 లక్షల నిధులు మంజూరు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాకలం)
మండలంలోని రాజేశ్వరరావుపేట గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లే రహదారిపై కల్వర్టు నిర్మాణానికి రూ.26 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల గతంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో రూ.26 లక్షల అంచనా వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆగస్టు 16న కలెక్టర్‌కు లేఖ రాశారు. వర్షాకాలంలో కల్వర్టు లేకపోవడంతో శ్మశాన వాటికకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే విజ్ఞప్తిపై అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 10న జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రూ.26 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్లకు రాజేశ్వరరావుపేట గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR, JAGTIAL.
Present : B. Satya Prasad, IAS

Lr.No.C1/VB-G-RAM G/Culvert/2026-27 Dt:10.09.2026

Sub:- DRDA Jagtial – VB-G-RAM G 2026-27 – Construction of Culvert on road to Smashanavatika, Rajeshwarraopet (v) Metpalli Mandal - Proposals Received- Administrative sanction – Orders – Issued.

Ref Asst. Executive Engineer, MPP, Metpalli Estimation, Dt: 16.08.2026

ORDER:

Anent to the reference cited, The Asst. Executive Engineer, MPP, Metpalli has proposed the Construction of Culvert on road to Smashanavatika, Rajeshwarraopet (v) Metpalli Mandal vide reference cited under VB-G-RAM G -2026-27 Grant.

| S.No. | Name of the Mandal | GP Name | Name of the work | Est.Cost (Rs. in Lakhs) |
|---|---|---|---|---|
| 1 | Metpalli | Rajeshwarraopet | Culvert on road to Smashanavatika, Rajeshwarraopet (v) Metpalli Mandal | 26.00 |

The Administrative sanction is hereby accorded for the above Culvert work for an Amount 26.00 lakhs under VB-G-RAM G – 2026-27 Grant.

The District Panchayat Raj Engineer, Jagtial/ DE/AE PR Metpalli are instructed to take up and complete the above construction of Culvert work as per the Rules Vogue and Guidelines issued by the Government from time to time.

District Collector/DPC-VB-G-RAM G, Jagtial.

Copy To
The MPDO, Metpalli for information and necessary action.
The Dist.Panchayat Raj Engineer for compliance
The Director, PR&RD, for kind information.

# నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులు




బుగ్గారం సెప్టెంబర్ 10 ప్రజా కలం ప్రతినిధి బి ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ,దళితులను అవమానించేలా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ చౌరస్తా కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించి,అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం , భారత రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్,నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉప సర్పంచులు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ త్యాగాలు స్ఫూర్తిదాయకం

## – కలెక్టరేట్‌లో వీరనారికి ఘన నివాళులు



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా కలం): తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన చాకలి ఐలమ్మ వర్ధంతిని జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని కోరారు. చాకలి ఐలమ్మ పేరుతో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటైన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలను రాష్ట్ర తొలి మహిళా విశ్వవిద్యాలయంగా ప్రకటించిందని, అనంతరం 2024లో దీనికి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా నామకరణం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# ప్రముఖ రచయిత కేవీ. నరేందర్‌కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా కలం): జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత కేవీ. నరేందర్‌కు 2015 సంవత్సరానికి గాను ఉత్తమ నవలా రచయిత పురస్కారం లభించింది. ఆయన రచించిన 'బొంబాయి ఫైల్స్' (బొంబాయి) నవలకు ఈ అవార్డును తెలుగు విశ్వవిద్యాలయం నిపుణుల కమిటీ ఎంపిక చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వెలుదండ నిత్యానందరావు ఈ విషయాన్ని ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల్లో 12 మంది రచయితలను పురస్కారాలకు ఎంపిక చేయగా, నవలా విభాగంలో కేవీ. నరేందర్ ఎంపికయ్యారు. ఈ పురస్కారం కింద రూ.30,116 నగదు, శాలువా, జ్ఞాపిక అందజేయనున్నారు. ఈ నెల 26న హైదరాబాద్ నాంపల్లి ప్రాంగణంలోని శ్రీ ఎన్.టి.రామారావు కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఆచార్య కోట హనుమంతరావు తెలిపారు. గొల్లపల్లి మండలం చిల్వకోడూరుకు చెందిన నరేందర్ ఇప్పటివరకు సుమారు 35 అవార్డులను అందుకున్నారు. నవలా రచయితగా తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఆయనకు ఇదే తొలి అవార్డు. గతంలోనూ తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 'కీర్తి పురస్కారం' అందుకున్నారు. నరేందర్‌కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించడంపై కళాశ్రీ గుండేటి రాజు, కవయిత్రులు అయిత అనిత, మద్దెల సరోజన, కటుకం కవిత, లక్కరాజు శ్రీలక్ష్మి, చిందం సునీత, ములస్థం లావణ్య, పులి గోవర్ధన్, ఓదెల గంగాధర్, మాడిశెట్టి శ్రీనివాస్ తదితర సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

## – నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి
## – కలెక్టర్ బి. సత్యప్రసాద్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా కలం): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులతో పాటు అర్బన్ కాలనీలో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్.. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ భవనాలు కీలకమని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దశలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనుల నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాలను ప్రారంభించి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, తహసీల్దార్ ముక్తార్ పాషా, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించండి

### – మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్

### – వనమహోత్సవంలో మొక్కల పంపిణీ




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాకలం):

మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్ సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని 6వ వార్డులో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బంగారుకాళ్ల నీరజ, నాయకులు కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బెల్లంపల్లి బస్తిలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్

### - దావా స్వాతి



బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 10, (ప్రజా కలం) ప్రతినిధి.. బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డు బెల్లంపల్లి బస్తిలో నగర అభివృద్ధి నిధుల నుంచి నూతన సైడ్ కాలువ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ కాంపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.వార్డ్ అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వార్డ్ ఇంచార్జ్ కాంపెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని,సమస్య ఎక్కడున్నా పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు.రానున్న రోజులో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో ఎన్నడు లేని విధంగా బెల్లంపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపెడుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిమ్రాన్, డి.ఇ సుమతి, కాంట్రాక్టర్ సాయి, కౌన్సిలర్స్, వార్డ్ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు...




ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 10 ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ శాఖ ఈ –పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో విధులకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు సామూహిక సెలవులు పెట్టి తమ నిరసనను తెలియజేశారు. సంబంధిత మండల కార్యాలయాల్లో ఎంపీడీఓలకు సామూహిక సెలవు పత్రాలను సమర్పించారు.ఐదు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించుకోవడం, రోజువారీ ఖర్చులు నిర్వహించడం, విధులకు రాకపోకలు సాగించడం కూడా కష్టంగా మారిందని కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు.ఎన్నిసార్లు తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సామూహిక సెలవుల నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలు, పంచాయతీ పరిపాలనకుసంబంధించిన అనేక కీలకమైన ఆన్‌లైన్ పనులు, ప్రజలకు అందించే సేవల్లో కంప్యూటర్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,తమ జీతాల విషయంలో మాత్రం ఎందుకు ఇంత నిర్లక్ష్యం జరుగుతోందని వారు ప్రశ్నిస్తున్నారు.

## కుక్కల బెడదను పరిష్కరించాలని వినతి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాకలం) మెట్‌పల్లి పురపాలక సంఘం పరిధిలోని 16వ వార్డులో గత కొన్ని రోజులుగా కుక్కల బెడద తీవ్రంగా ఉందని,



రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని 16వ వార్డు కౌన్సిలర్ అరిసె వనజ మురళి తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పురపాలక సంఘం మేనేజర్ వెంకటలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సెప్టెంబర్ 5న ఉదయం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో వార్డు ప్రజలు కుక్కల బెడద సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిసె మురళితో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మద్దుల గోపాల్ రెడ్డి

### - కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా

ఎండపల్లి, సెప్టెంబర్ 10 : ( ప్రజా కలం ప్రతినిధి )

మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి పర్యటించి ఇటీవల విషాద ఘటనలు ఎదుర్కొన్న పలు కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి పరిస్థితు లను తెలుసుకుని ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పారు. కొత్తపేట్ గ్రామం లో కాంగ్రెస్ కార్యకర్త మండల బీసీ సెల్ అధ్యక్షులు పోలోజు శ్రీనివాస్ కుమారుడి ఆరోగ్య సమస్యల తో సర్జరీ చేయించుకుని డిశ్చార్జ్ అయి వచ్చిన విషయం తెలిసి గోపాల్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యాన్నిచారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మద్దుల గోపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. అనంతరం పైడిపల్లి గ్రామం లో తన అభిమాని బరిగల సురేష్ మాతృమూర్తి ఇటీవల స్వర్గస్థులవగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అవసరమైన సమయం లో తాను అండగా ఉంటానని తెలిపారు. గోడిసేలపేట గ్రామం లో సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి చక్రపాణి ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మద్దుల గోపాల్ రెడ్డి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చక్రపాణి కుటుంబ సభ్యులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చక్రపాణి తో తనకి 40 సంవత్సరాల పరిచయం అని మీరు ఎలాంటి విషయంలోనైనా మీకు ఎలాంటి సహాయం కావాలన్నా నిస్సందేహంగా తక్షణమే అడగాలన్నారు మీ కుటుంబానికీ



అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లా డుతూ కష్టసమయం లో కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యత అని తెలిపారు.

ప్రతి కుటుంబానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని మద్దుల గోపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గెల్లు చంద్ర శేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచు ల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్, కోడిపల్లి కొమురమ్మ-శ్రీనివాస్, కొంగల జగదీశ్వర్ రెడ్డి, వెంకటస్వామి, గొల్లపల్లి భూమయ్య, గొల్లపల్లి పుల్లయ్య, గొడిశెలపేట గ్రామశాఖ అధ్యక్షులు గోపు రాకేష్, సంఘ పెద్దిరాజు, గర్వకుర్తి దిలీప్, జంగా అంజి, బొంగాని గోపాల్, కందికట్ల అశోక్, పంజా సాయి, సురేందర్, ఎంజీఆర్ అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ

### రజక సంఘం గౌరవ అద్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ – ఘనంగా వీరవణిత చాకలి ఐలమ్మ వర్ధంతి

పెద్దపల్లి,సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం గౌరవ అద్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరవణిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో తిలక్ నగర్ లో గల ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రజక సంఘం గౌరవ అద్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్,కుల సంఘం నాయకుడు బొడ్డుపల్లి రామ్మూర్తి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి ఉద్యమాలకు స్ఫూర్తిదాయ కమన్నారు.రజాకారు మూకలితో పాటు విష్ణు దేశముఖ్ ఆగడాలను ఎదిరించిన ఐలమ్మ విస్నూరు దేశముఖ్ గుండెల్లో అగ్నికణంగా నిలిచిందన్నారు.ఐలమ్మ పోరాటం తెలంగాణ సాధన ఉద్యమానికి ఊపిరిగా నిలిచిందని,అదే స్ఫూర్తితో పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించు కున్నామని గుర్తు చేశారు.కాని నేటికి రజకులు సామాజికంగా,ఆర్థికంగా వేనుకబడి ఉన్నారని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రజకుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని, రజకులను కేవలం ఓటు బ్యాంకు కోసం తప్ప వారి అభివృద్ధికి కోసం పాటు పడింది లేదని ఆరోపించారు.




దేశంలోని 17 రాష్ట్రాలల్లో రజకులను ఎస్సీ ల జాబితాల చేర్చాయని,అలాగే తెలంగాణలో కూడ రజకులను ఎస్సీల జాబితాలో చేర్చి రాజకీయంగా,ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.హైదరాబాద్ ట్యాంక్ బండ్ పైన, తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భూత గడ్డ సంపత్, మున్నూరు కాపు సంఘం నాయకుడు గండు రంగయ్య,సామాజిక కార్యకర్త మంద భాస్కర్,బొడ్డుపల్లి అశోక్, కృష్ణ,రాచమల్ల సతీష్,పవనూరి లక్ష్మయ్య, గుడికందుల శ్రీనివాస్,ఎలా పోతారం మొగిలి,నరసయ్య, బొడ్డుపల్లి మొండయ్య, మహేష్, శ్రీనివాస్, మధునయ్య, బొడ్డుపల్లి మోహన్,ముత్తునూరి మల్లికార్జున్, శ్యాంసుందర్,పవన్,ముక్కెర రాజేశం,బొడ్డుపల్లి సంతు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

### – గంగారం సర్పంచ్ రేకుల జ్యోతి రఘు

### – ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉచిత దుస్తుల పంపిణీ




పెద్దపల్లి,సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వం ప్రతి ఏటా కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తూ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని గంగారం గ్రామ సర్పంచ్ రేకుల జ్యోతి రఘు పిలుపునిచ్చారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఈర్ల సమ్మయ్యతో కలిసి విద్యార్థులకు ఉచిత పాఠశాల దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి రఘు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలతో పాటు నైపుణ్యంతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.రాబోయే సెప్టెంబర్ 15నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం వేళల్లో అల్పాహారం కూడా అందించనున్నట్లు వెల్లడించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ.సర్కారు బడుల బలోపేతానికి సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు ప్రజల ఆస్తి అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.ప్రస్తుతం ప్రైవేటు విద్య వ్యాపార ధోరణిగా మారిందని,భావితరాల భవిష్యత్తుకు అది సరైనది కాదని హితవు పలికారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే శాస్త్రీయమైన, మెరుగైన విద్య అందుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మిరియాల మల్లేష్,చిక్కుల వంశీ,గుడ్ల మమత సంపత్,ముసుగు అంజయ్య,ముస్కె కుమారస్వామి,అవుల సునీత తిరుపతి,కూస లతరాజులతో పాటు ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి,బండారి సరిత,విద్యార్థులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట పటిమ అందరికీ ఆదర్శం

### గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ – ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

పెద్దపల్లి:సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరనారి,ఉద్యమ స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ కొనియాడారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ అధ్యాపక బృందంతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి క్రూర అరాచకాలను, దౌర్జన్యాలను ఎదురించి నిలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు.భూస్వాములు తన భూమిని లాక్కోవడానికి ప్రయత్నించినప్పుడు బెదరకుండా,ధైర్యంగా నిలబడి కుటుంబ హక్కుల కోసం పోరాడిన వ్యక్తి ఆమె అని గుర్తుచేశారు.ఐలమ్మ




చూపిన తెగువ, పోరాట పటిమ ఎందరో తెలంగాణ ప్రజలకు విప్లవ స్ఫూర్తినిచ్చాయని చెప్పారు.విద్యార్థులు కూడా తమ హక్కులకు భంగం కలిగినప్పుడు అధైర్యపడకుండా ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని,ధైర్యంగా హక్కుల సాధనకై పోరాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.ఎ.సమద్,అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని అణచివేసే ప్రయత్నంచేస్తే ఊరుకోం..

### – కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి

### – వెల్గటూర్ లో నల్ల బ్యాడ్జిలతో నిరసన

వెల్గటూర్, సెప్టెంబర్ 10, ప్రజాకలం, ప్రతినిధి :

తెలంగాణలో గల దళితుల ఆత్మగౌరవాన్ని అణిచివేసే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి అన్నారు. దళితులు కెసిఆర్ ఫామ్ హౌస్ ప్రాంతాన్ని సందర్శించారని, బిఆర్ఎస్ నాయకులు, అక్కడి ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు వెల్గటూర్ లో అంబేద్కర్ కూడలి వద్ద నల్ల



బ్యాడ్జిలతో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో గల దళితులను కించ పరిచే విధంగా ఏ కార్యక్రమాలు చేసిన ఊరుకోమని హెచ్చరించారు. ఫాం హౌస్ పరిసరాలను బిఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్ళతో శుద్ధి చేయడం వారు చేసిన చాలా పెద్ద తప్పని, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసినట్లేనని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు వారు చేసిన తప్పుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో మామిడి వ్యాపారి మృతి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, సెప్టెంబర్ 10:

కోరుట్ల పట్టణంలో గత 25 ఏళ్లుగా మామిడి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న బషీర్ (55)బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, తోటి మామిడి వ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం గత ఐదేళ్లుగా మామిడి వ్యాపారంలో ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో బషీర్ అప్పులు పెరిగాయి. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైనట్లు వారు తెలిపారు. ఇటీవల ఓ బ్యాంకులో ఇంటిపై రుణం తీసుకోగా, రుణం చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు. రుణం చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఇంటిని బ్యాంకు జప్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇల్లు కూడా కోల్పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బషీర్ అనారోగ్యానికి గురయ్యారని చెప్పారు. వారం రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చారు. బుధవారం రాత్రి మరోసారి గుండెనొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురై హఠాత్తుగా మృతి చెందినట్లు తోటి వ్యాపారులు తెలిపారు. బషీర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుట్ల మామిడి వ్యాపారుల సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## చదరంగంలో మోక్షజ్ఞ ప్రతిభ.. జిల్లా స్థాయి పోటీలకు అర్హత

మెట్‌పల్లి:(కోరుట్ల)సెప్టెంబర్ 10 (ప్రజాకలం): వెల్లుల్లలో బుధవారం నిర్వహించిన




మండల స్థాయి చదరంగం పోటీల్లో మెట్‌పల్లిలోని అక్షర హైస్కూల్ విద్యార్థిని ఎర్రోజి మోక్షజ్ఞ ద్వితీయ బహుమతి సాధించింది. ఈ ప్రతిభతో జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఆమె అర్హత సాధించింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల కరస్పాండెంట్ కొత్తూరు శ్రీనివాస్ మోక్షజ్ఞను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థిని మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినిని క్రీడారంగంలో ప్రోత్సహించిన పాఠశాల పీఈటీ నాగేంద్రతో పాటు తల్లిదండ్రులను కూడా పాఠశాల తరపున అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై మున్సిపల్ కొరడా

### – రోడ్లపై అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు తొలగింపు




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్10 (ప్రజాకలం):

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, రోడ్లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు గురువారం ఈ చర్యలు చేపట్టారు.రోడ్లపై బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు, ప్రజల నడకకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రోడ్లపై అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, తోపుడు బండ్లు, పానీపూరి బండ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నరేష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థికి ఘన సన్మానం



మల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి): ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన కేరళ హైస్కూల్ పూర్వ విద్యార్థిని మోతే హన్సికను పాఠశాల ప్రిన్సిపాల్ సీబీ. అనిల్‌సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిల్‌సింగ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యనభ్యసించిన హన్సిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీనా, సాయి రాణి, శ్వేత, రజిత పాల్గొన్నారు.

# పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలి : సూపర్వైజర్ జానకి

గొల్లపల్లి, సెప్టెంబర్ 10 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి సెక్టార్ పరిధిలోని చిల్వాకోడూర్ గ్రామంలో అంగన్వాడీ సూపర్వైజర్ జానకి ఆధ్వర్యంలో గురువారం అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించినారు.పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమ తుల్య ఆహారం ఎంతో అవసరమని అంగన్వాడి సూపర్వైజర్ జానకి తెలి పారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పద్మజ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భి ణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నారులకు సమయానికి పౌష్టికాహారం అందించాలని సూచించారు.మహిళలు ఎక్కువగా రక్తహీనతకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని కాబట్టి గర్భిణీ, బాలింతలు, కిశోర బాలికలు, మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని తీసుకునే ఆహారంలో తాజాకూరగాయలు ,ఆకుకూరలు పాలు, పండ్లు,గుడ్లు,మొలకెత్తిన గింజలు,చిరు ధాన్యాలు తీసుకోవాలని వారు సూచించారు.పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, నర్మద, గంగాభవాని ఆశ వర్కర్లు గర్భిణీ,బాలింతలు, కిశోర బాలికలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవాలు

## - అంబరాన్నంటేలా వేడుకలకు సన్నాహాలు
## - నేడు కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ముఖ్య నేతల భేటీ



పెద్దపల్లి,సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ,రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయి.ఈ ఉత్సవాల నిర్వహణకై వ్యూహరచన చేసేందుకు ఈ నెల 11న శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు ప్రకటించారు.ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య పాల్గొని మాట్లాడుతూ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశానికి జాతీయ,రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు హాజరవుతున్నారని తెలిపారు.జిల్లాలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా,మండల కమిటీల నాయకులు,ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్,పాల రాజేశం,జిల్లా కో-కన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్,శనిగరపు పోచన్న,ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రగైర శిఖరాగ్రాన మహిపాల్‌రెడ్డి

పెద్దపల్లి:సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి సముద్ర మట్టానికి 5,819 మీటర్ల ఎత్తులో ఉన్న రుద్రగైర పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి మరో అరుదైన ఘనత సాధించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆలోచనతో రూపుదిద్దుకున్న 'యువశక్తి' కార్యక్రమంలో భాగంగా, యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచి యూనిఫాం సర్వీసులకు ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సాహస యాత్ర చేపట్టారు. సెప్టెంబరు 5న గంగోత్రి నుంచి మరో ఎనిమిది మంది పర్వతారోహకులతో బయలుదేరిన మహిపాల్‌రెడ్డి, సెప్టెంబరు 9న అర్ధరాత్రి సమిట్ క్యాంప్ నుంచి ప్రయాణమై ప్రతికూల వాతావరణాన్ని ధీటుగా ఎదుర్కొంటూ శిఖరాన్ని చేరుకున్నారు. అక్కడ 'సే నో టు డ్రగ్స్' బ్యానర్‌ను ప్రదర్శించి యువత ఆరోగ్యకరమైన, లక్ష్యసాధనతో కూడిన జీవితాన్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు.తాను అధిరోహించే ప్రతి పర్వతంపై మాదకద్రవ్య వ్యతిరేక సందేశాన్ని చాటుతున్న మహిపాల్‌రెడ్డి, రుద్రగైరపై బ్యానర్ ప్రదర్శనతో సాహసంతో పాటు సమాజ పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు.




# ఆయిల్‌పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం

## - జిల్లా ఉద్యానవన,పట్టుపరిశ్రమల శాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్
## - ఒక్కరోజే 80 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాట్లు



పెద్దపల్లి:సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ నీటితో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని,రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు,ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ కోరారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంట విస్తరణే లక్ష్యంగా చేపట్టిన బృహత్ నాట్ల ఉద్యమం గురువారం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 80 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. గట్టు సింగారం గ్రామంలో రైతు దుగ్గెంపూడి రవీందర్ రెడ్డికి చెందిన 20 ఎకరాల వ్యవసాయ భూమిలో నాట్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ ఆయిల్‌పామ్ సాగుతో చేకూరే ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ ప్రసంగించారు. వాతావరణంలో మార్పులు,నీటి కొరత ఏర్పడుతున్న ఈ తరుణంలో నీటిని పొదుపుగా వాడుకుంటూ,దీర్ఘకాలికంగా స్థిరమైన,నికరమైన రాబడిని పొందడానికి ఆయిల్‌పామ్ సాగు ఒక సరికొత్త మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా మొక్కల పంపిణీ, బిందు సేద్యం,అంతర పంటల సాగు మరియు తోటల సంరక్షణకు భారీగా రాయితీలతో పాటు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తోందని వెల్లడించారు. రైతు సోదరులు ఈ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఆయిల్‌పామ్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేశు కళ్యాణ్,ఉద్యానవన శాఖాధికారి ఎస్. మహేష్,క్షేత్రాధికారి అరవింద్,స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల్లో ఓబీసీ కుల గణన చేపట్టాలి

## ప్రతి కులానికి ప్రత్యేక క్యాస్ట్ కోడ్ కేటాయించాలి - ప్రొఫెసర్ మురళీ మనోహర్



పెద్దపల్లి:సెప్టెంబర్10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జనాభా లెక్కల్లో ఓబీసీ కుల గణన చేపట్టి,డ్రాప్ డౌన్ పద్ధతిలో ప్రతి కులానికి ప్రత్యేక క్యాస్ట్ కోడ్ కేటాయించాలని బహుజన ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లిలో బహుజన ప్రజాస్వామిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దూడారి శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్,జాతీయ జ్యోతిరావు పూలే సత్యశోధక సమాజం అధ్యక్షులు కే.మురళీ మనోహర్, ప్రొఫెసర్ తిరునగరి శేషులు ముఖ్య అతిథులుగా హాజరై భవిష్యత్తు బీసీ ఉద్యమ కార్యాచరణపై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సరైన లెక్కలు తేల్చకపోవడం వల్లే బీసీలు ఆర్థికంగా,రాజకీయంగా, సామాజికంగా, పారిశ్రామికంగా, విద్యా ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీల సామాజిక అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుకుంటోందని,నిష్పక్షపాతంగా కుల గణన జరిపితే రాజ్యాధికారాన్ని వదులుకోవాల్సి వస్తుందనే భయంతోనే కేంద్రం ఓబీసీల వాటాను తేల్చడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత సంక్షేమ పథకాలకు ఆశపడి బీసీలు తమ సామాజిక, ఆర్థిక విముక్తిని విస్మరిస్తున్నారని,ఆ బానిసత్వ భావజాలం నుంచి బయటపడి విముక్తి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో 56 శాతంగా ఉన్న వెనుకబడిన వర్గాల త్యాగాలు ఎనలేనివని,అట్టి బీసీలు రాజ్యాధికారంలో తమకు తగిన వాటా దక్కే వరకు అస్తిత్వ పోరాటాలు సాగించాలని కోరారు.రాబోయే రోజుల్లో పెద్దపల్లి వేదికగా బలమైన బీసీ ఉద్యమ విస్ఫోటనం జరగబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.దూడారి శ్రీమన్నారాయణ స్థాపించిన బహుజన ప్రజాస్వామిక వేదిక నిర్మాణాత్మకమైన బీసీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.ఈ జిల్లా స్థాయి సమావేశంలో పలు బీసీ సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు,విద్యార్థులు, ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక రంగాల నాయకులు పాల్గొన్నారు.కేంద్రం కుల గణన చేపట్టే వరకు ఢిల్లీ పీఠం కదిలేలా నిరంతర ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# రాజీమార్గంలో కేసుల పరిష్కారం

## - ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్
## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల





పెద్దపల్లి:సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులు పరిష్కరిస్తున్నామని,పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టు సముదాయాల్లో ఈ నెల 12న న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు.గురువారం జిల్లా కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు,సివిల్ దావాలు,భూ వివాదాలు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు,బ్యాంకు రికవరీ,చెక్ బౌన్స్ కేసులతో పాటు కుటుంబ తగాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసులపై ఎలాంటి అప్పీల్ లేదా రివిజన్లకు అవకాశం ఉండదని,కేసు ఇక్కడితో పూర్తిగా ముగుస్తుందని పేర్కొన్నారు.దీనివల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే అవసరం తప్పి సమయం, ధనం ఆదా అవ్వడమే కాకుండా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.తమ కేసు రాజీ పరిధిలోకి వస్తుందో లేదో తెలుసుకోవడానికి ప్రజలు న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.అలాగే కోర్టు కేసుల్లో వాదించేందుకు ఆర్థిక స్తోమత లేని అర్హులైన పేదలకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని వెల్లడిస్తూ,ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశం అనంతరం జిల్లా అదనపు న్యాయమూర్తి స్వప్న రాణి,న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్‌లతో కలిసి జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు.

# కాంగ్రెస్ పాలనలో దివాళా దిశగా తెలంగాణ

## - మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ధ్వజం

పెద్దపల్లి: సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ తీవ్ర దివాళా దిశగా పయనిస్తోందని,స్వరాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలకు గులాంగిరీ చేస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.గురువారం పెద్దపల్లి పట్టణంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు.తెలంగాణలో అన్ని వసతులు సిద్ధంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం,పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల మోటార్లను కావాలనే ఆన్ చేయడం లేదని,కాళేశ్వరంలో చిన్న పిల్లర్ రిపేర్ సరిపోయే దానికి కేవలం కేసీఆర్ పై ఉన్న కక్షసాధింపుతో ఉత్తర తెలంగాణ మొత్తాన్ని ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని కేంద్ర సంస్థల నివేదికలు స్పష్టం చేసినా,ప్రభుత్వం కావాలనే దుష్ప్రచారం చేస్తోందన్నారు.శ్రీశైలంలోతాగునీటి పేరు చెప్పి తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా, పోతిరెడ్డిపాడు,వెలుగొండ టన్నెల్స్ ద్వారా రోజుకు 1-2 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ప్రశ్నించకుండా చూస్తూ ఊరుకుంటోందని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కేసీఆర్ పై అబాండాలు వేస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన,తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ మళ్లీ అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు.భూ దాహంతో కోటి ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా కింద పెట్టి రైతులను,ప్రజలను వేధిస్తున్నారని,ఎవ్వరూ భయపడి భూములు గానీ,పర్సంటేజీలు గానీ నాయకులకు,అధికారులకు ఇవ్వవద్దని కోరారు.మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 22ఏ నిబంధనలను, హైడ్రాని పూర్తిగా రద్దు చేసి పాతాళ గంగలో కలిపేస్తామని అభయమిచ్చారు.కొంతమంది ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు రాజకీయ నాయకుల మాటలు విని చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే రేపు జైలుపాలు కావాల్సి వస్తుందని,చట్టబద్ధంగా అధికారుల జాబితా తయారు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కేసీఆర్ కిట్,రైతుబీమా, రైతుబంధు లాంటి సంక్షేమ పథకాలను రద్దు చేసి,బీసీ సబ్‌ప్లాన్, 42శాతం రిజర్వేషన్లు, గొర్రెల పంపిణీ వంటి హామీలను గాలికొదిలేశారని,ఇప్పటికైనా ప్రభుత్వం విర్రవీగడం మానేసి పరిపాలన,ఉద్యోగ రిక్రూట్‌మెంట్లు,ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తామంతా జైళ్లకు,కేసులకు భయపడకుండా గొంతు పట్టి తెలంగాణ తెచ్చుకున్నామని,అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్,కౌన్సిలర్ వెన్నం సుజాత-రవీందర్,నాయకులు పూదరి చంద్రశేఖర్,కిషోర్,బొడ్డుపల్లి రమేష్,పల్లె మధు,వైద శ్రీనివాస్,అశోక్,నిఖిల్,మనోజ్,రాజేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

## యువతకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు
## ఏఐని సరైన రీతిలో వినియోగించుకోవాలి : కృష్ణ ఎల్లా

ఉస్మానియా యూనివర్సిటీ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యువత ఉద్యోగాలు చేసే వారిగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో 640 మంది పీహెచ్‌డీ పట్టాలు, 71 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ ఏఐ, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ... ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలను యువత మరింత సృజనాత్మకంగా, ఉత్పాదకంగా వినియోగించాలని సూచించారు.

# కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

భగత్‌నగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను, చట్టాలను హరిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ విమర్శించారు. కరీంనగర్ పద్మనాయక కళ్యాణ మండపంలోని అమరజీవి మాదన నారాయణ స్మారక ప్రాంగణంలో ఏఐటియుసి రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను నిర్వీర్యంచేసే కుట్రలు పన్నుతుందన్నారు. 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందన్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న వారితో పాటు అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులందరికి దుర్భర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. కార్మికులంతా ఏకమై పాలక ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, చీఫ్‌ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, ప్యాట్రన్ కలవేన శంకర్, అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రతినిధుల మహాసభకు అధ్యక్ష వర్గంగా టేకుమల్ల సమ్మయ్య, ప్రేమ్ పావని, వాసిరెడ్డి సీతారామయ్య, యూసుఫ్ వ్యవహరించారు.

# ఏఐ పోస్టుల్లో మూడోవంతు ఖాళీ

ఒంగోలు : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించడం లేదు. అనేక పోస్టులు ఖాళీగా మిగిలిపోతున్నాయి. జిల్లాకు 104 సెకండరీ గ్రేడ్ టీచర్లు, 137 స్కూలు అసిస్టెంట్లు మొత్తం 241 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (ఏఐ) పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేక 36 మిగిలిపోగా 205 మందిని ఎంపిక చేశారు. వీరిలో 42 మంది వివిధ కారణాలతో విధుల్లో చేరేందుకు విముఖత చూపారు. దీంతో 241 పోస్టుల్లో 163 మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన మూడో వంతు పోస్టులు అంటే 78 ఖాళీగా మిగిలిపోయాయి. ఏఐ పోస్టులు భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వం వచ్చే అక్టోబరులో మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి రెగ్యులర్ ప్రాతిపదికన టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం ఏఐలకు డిమాండ్ తగ్గినట్లు తెలుస్తోంది.